

ఐపిఎల్‌కు వేళాయె..

- గుజరాత్ × చెన్నై మ్యాచ్‌తో షురూ..

• లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 237 | విజయవాడ, శుక్రవారం 31 మార్చి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 31 March 2023 | Rs

రాజధానిగా

అమరావతినే కొనసాగించాలి

- ఈ ప్రాంత ప్రజలను నట్టేట ముంచిన పాపం బిజెపి, వైసిపిలదే
- రైతుల, ప్రజా ఉద్యమానికి సిపిఐ(ఎం) మద్దతు
- రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు వెల్లడి

6

నెల నెలా 'షాక్'

- తెలియకుండానే ట్రూఅప్ బాదుడు
- పెట్రోల్ ధరల మాదిరే కరెంట్ ఛార్జీలు పెంపు
- డిస్కమ్‌లకు ఎపిఇఆర్‌సి అనుమతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మూలిగే నక్కపై తాటిపండుపడ్డ చందంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారుల పరిస్థితి తయారైంది. ఇప్పటికే శ్లాబులు మార్పు, ఫిక్స్‌డ్ ఛార్జీల పెంపు, ట్రూఅప్ భారాలతో ప్రజలపై డిస్కమ్‌లు వేల కోట్ల రూపాయల భారాలను మోపాయి. ఇది చాలదన్నట్లుగా ఇప్పుడు కొత్తగా ప్రతి నెల ట్రూఅప్ ఛార్జీలు బాదుకునేందుకు డిస్కమ్‌లకు అనుమతిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) బుధవారం ఉత్తర్వులను విడుదల చేసింది. డిసెంబర్ 29వ తేదీన కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ తీసుకొచ్చిన గెజిట్ ఆధారంగా ఎపిఇఆర్‌సి ఈ ఉత్తర్వులను విడుదల చేసింది. ఇఆర్‌సి కార్యదర్శి కె.రాజబాపయ్య ఈ గెజిట్‌ను విడుదల చేశారు. ప్రతి నెల విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఇక నుండి నెలనెలా భారాలు పెరగనున్నాయి. ప్రతి నెలా విద్యుత్ ఛార్జీలు పెంచుకునేందుకు డిస్కమ్‌లకు అనుమతి వచ్చింది. దీంతో ప్రతిరోజూ పెట్రోల్ ధరలు ఎలా పెరుగుతాయో, విద్యుత్ ఛార్జీలూ ప్రతి నెలా పెరగనున్నాయి. గతంలో ఏడాదికొక్కసారి ట్రూఅప్ విధానం ఉండేది. దీనిపైనా ఎపిఇఆర్‌సి బహిరంగ విచారణ జరిపి అందరి అభిప్రాయాలూ తీసుకునేది. ఏడాది విధానాన్ని డిస్కమ్‌లు మూడు నెలలకు తీసుకొచ్చాయి. కేంద్రం గెజిట్‌కు అనుగుణంగా ఫిబ్రవరి 10వ తేదీన

మిగతా 2లో

(ఫైల్ ఫోటో)



భారాలు ఉపసంహరించుకోవాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ ఛార్జీలను పెంచలేదని ఒకవైపు నోటిఫికేషన్ జారీ చేస్తూ, మరోవైపు సర్దుబాటు ఛార్జీల పేరుతో దొడ్డిదారిన భారాలు వేయడం మోసపూరితమని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. 2023 ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతినెలా విద్యుత్ యూనిట్‌కు 40 పైసలు చొప్పున అదనంగా సర్దుబాటు ఛార్జీలు (ట్రూఅప్) వసూలు చేయడాన్ని వ్యతిరేకించారు. దీంతోపాటు సంవత్సరాంతంలో అవసరమైతే అదనంగా సర్దుబాటు భారం మోపే ప్రమాదమూ ఉందని తెలిపారు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం రూ.1400 కోట్లు విద్యుత్ ఛార్జీలు భారం మోపిందని, 2014-19 మధ్య వినియోగించుకున్న విద్యుత్‌కు ఇప్పుడు 36 నెలలపాటు యూనిట్‌కు 25 పైసలు చొప్పున వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల రూ.2,900 కోట్ల భారం పడిందని వివరించారు. 2020-21లో వినియోగించుకున్న విద్యుత్‌పై యూనిట్‌కు 65 పైసలు వరకు 2023 ఏప్రిల్ నుంచి అదనంగా వసూళ్లకు ఆదేశాలు ఇచ్చారని, ఈ పేరుతో రూ.3,083 కోట్ల భారం వినియోగదారులపై పడనుందని తెలిపారు. మళ్లీ స్మార్ట్ మీటర్లు పెట్టి ఆ వ్యయాన్నీ నెలవారీ ప్రజలపై వేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని శ్రీనివాసరావు విమర్శించారు. బడా కార్పొరేట్ కంపెనీల నుంచి విద్యుత్ అధిక రేట్లకు కొనుగోలు చేస్తూ ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే రీతిలో బొగ్గు అధిక రేట్లకు కొనుగోలు చేసి సర్దుబాటు ఛార్జీల పేరుతో దండుకుంటున్నారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని, తగ్గిస్తామని మాట చెప్పి అధికారంలోకి వచ్చిన వైసిపి నాయకులు, మాట తప్పి ఈ రీతిలో భారాలు మోపడం అన్యాయమని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను ప్రతినెలా వేసే ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలను ప్రతిఘటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

పరువు నష్టం కేసులో

రాహుల్‌కు పాట్నా కోర్టు సమన్లు !

పాట్నా : ఏప్రిల్ 12న తమ ముందు హాజరు కావాల్సిందిగా పాట్నా కోర్టు, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. బీహార్ సీనియర్ బిజెపి నేత, రాజ్యసభ సభ్యులు సుశీల్ కుమార్ మోడీ, రాహుల్‌పై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో ఈ సమన్లు జారీ అయ్యాయి. 2019లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కర్ణాటకలోని కోలార్‌లో ప్రచారం చేస్తూ రాహుల్ గాంధీ మోడీ ఇంటి పేరును ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు చేశారు. దానిపై ఈ కేసు దాఖలైంది. గుజరాత్ కోర్టు రాహుల్‌కు రెండేళ్లజైలు శిక్ష విధించిన నేపథ్యంలో తాజాగా ఈ కేసు దాఖలైంది.



"మోడీ ఇంటి పేరు వున్నవారందరూ దొంగలేనని వ్యాఖ్యానించడం ద్వారా తనవంటి వెనుకబడిన వర్గాల ప్రజలందరినీ రాహుల్ అవమానించారు. దీనిపై పాట్నా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పరువు నష్టం కేసు వేశా. ఇప్పుడు రాహుల్ స్టేట్‌మెంట్‌ను రికార్డుచేసేందుకు కోర్టు సమన్లు జారీ చేసింది." అని సుశీల్ కుమార్ మోడీ వీడియో సందేశంలో పేర్కొన్నారు. 2019 జులై 6న ఈ కేసులో రాహుల్ గాంధీ లొంగిపోవాల్సి వచ్చిందని, ప్రస్తుతం బెయిల్‌పై వున్నారని తెలిపారు. ఇటువంటి పరువు నష్టం కేసులోనే ఈ నెల 23న సూరత్ కోర్టు రాహుల్‌ను దోషిగా నిర్ధారించి రెండేళ్ల జైలు శిక్ష విధించింది.



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్

ఉపాధి బకాయిలు రూ. 2,500 కోట్లు ఇవ్వండి

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలకు ముఖ్యమంత్రి జగన్ వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రానికి ఇవ్వాల్సిన సుమారు రూ.2,500 కోట్లు ఉపాధి హామీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆమె నివాసంలో సిఎం జగన్ కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. దాదాపు 40 నిమిషాలపాటు జరిగిన ఈ సమావేశంలో వివిధ అంశాలు చర్చించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను సిఎం జగన్ కలిసిన తరువాత విడుదల చేసిన ప్రకటనలోని అంశాలనే, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సిఎం కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. 2021-22లో రూ.42,472 కోట్ల రుణ పరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ.17,923 కోట్లకు కుదించిన విషయాన్ని ఆర్థికశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎపికి రెవెన్యూ లోటు కింద రావాల్సిన రూ.36,625 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. పోలవరం నిధులు విడుదల చేయాలన్నారు. తెలంగాణ నుంచి ఎపికి రావాల్సిన విద్యుత్ బకాయిలు రూ.7,058 కోట్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు.



తెలంగాణలోని భద్రాద్రి ఆలయంలో సీతారాముల కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా భద్రాద్రి రాములోరి కల్యాణం

- 9న ఒంటిమిట్టలో

• లోపలి పేజీలో..

శాసనమండలి ఎన్నికల ఫలితాలపై పోస్ట్‌మార్టమ్

- ఏప్రిల్ 3న ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులతో సిఎం భేటీ

హెచ్1 బి వీసాలతో

దంపతులిద్దరూ ఉద్యోగాలు చేయొచ్చు

- అమెరికా కోర్టు తీర్పు

వాషింగ్టన్ : హెచ్1బి వీసాతో అమెరికాలో పనిచేస్తున్న విదేశీయుల భాగస్వాములు కూడా ఉద్యోగాలు చేయవచ్చని అక్కడి న్యాయస్థానం తీర్పునిచ్చింది. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగం చేసుకోవచ్చని వెల్లడించింది. 'సేవ్ జాబ్స్ యుఎస్ఎ' సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను యుఎస్ జిల్లా న్యాయమూర్తి తన్యా చుక్తాన్ కొట్టివేశారు. ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో హెచ్1బి వీసాతో అమెరికాలో పనిచేస్తున్న వారి జీవితభాగస్వామి కూడా ఉద్యోగం చేసుకునేందుకు వీలు కలిగేలా చట్టంలో సవరణలు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనివల్ల స్థానికంగా ఉన్న వారికి ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. అమెజాన్, యాపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి పెద్ద పెద్ద సంస్థలు కూడా ఈ పిటిషన్‌ను వ్యతిరేకించాయి. హెచ్1బి వీసాతో అత్యధికంగా భారతీయులే అమెరికాలో ఉద్యోగాలకు వెళుతుంటారు. ఈ తీర్పు వల్ల అమెరికాలోని చాలా మంది భారతీయులకు ప్రయోజనం కలుగుతుంది.

హెచ్ 4 వీసా పొందిన విదేశీయులు అమెరికాలో వున్న సమయంలో పనిచేసుకోవడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీకి కాంగ్రెస్ ఎప్పుడూ అధికారాన్ని మంజూరు చేయలేదని సేవ్ జాబ్స్ యుఎస్ఎ పిటిషన్‌లో పేర్కొన్నట్లు తీర్పు సందర్భంగా న్యాయమూర్తి తాన్యా చుట్కాన్ అన్నారు. హెచ్ 4 వీసాదారుల జీవిత భాగస్వామి అమెరికాలో వుంటూ ఉద్యోగం చేసుకునేలా అనుమతి ఇచ్చేందుకు దేశ చట్టసభలు మొగ్గు చూపుతున్నాయని చుట్కాన్ గుర్తుచేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ విద్యార్థులకే కాకుండా వారి జీవిత భాగస్వాములు, వారిపై ఆధారపడిన వారికి కూడా గతంలో ఉపాధి కల్పించిందని న్యాయమూర్తి గుర్తుచేశారు. కోర్టు తీర్పు పట్ల అమెరికాలోని భారతీయులతోపాటు ఇతర దేశాల నుంచి వచ్చిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మధ్యప్రదేశ్‌లో ఘోరం

- బేలేశ్వర్ ఆలయంలో బావి పైకప్పు కూలి 14 మంది మృతి
- ఇండోర్ నవమి వేడుకల్లో పెను విషాదం

ఇండోర్ : శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో గురువారం విషాదం చోటు చేసుకుంది. బేలేశ్వర్ మహదేవ్ ఝులేలాల్ ఆలయంలో పురాతనమైన మెట్ల బావి పైకప్పు కూలి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. బావిలో పడిన మరో 19 మందిని కాపాడారు. లోపల 25మంది వరకు చిక్కుకుని వుంటారని భయపడుతున్నారు. వారికోసం గాలింపు కొనసాగుతోంది. పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చిన భక్తులు బావి పైకప్పుపై కూర్చున్నారు. బరువు ఎక్కువ కావడంతో పై కప్పు కూలిపోయి ఈ దుర్ఘటన చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. మెట్లబావిలో పడిపోయిన వారిని కాపాడేందుకు పోలీసులు, స్థానికులు ప్రయత్నించారు. మరణించిన వారిలో 10 మంది మహిళలు వున్నారని రాష్ట్ర హోంమంత్రి నరోత్తమ్ మిశ్రా భోపాల్‌లో విలేకర్లకు తెలిపారు. ఆచూకీ తెలియకుండా పోయిన వారిలో కొంతమంది పిల్లలు కూడా వున్నట్లు ఆందోళన చెందుతున్నారు. బావిలోని నీటినంతా బయటకు తోడించి గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. తొలుత మృతుల సంఖ్య 12గా ఇండోర్ కలెక్టర్ ఇళయరాజా ప్రకటించారు. గాయపడినవారిని ఆస్పత్రికి తీసుకెళుతుండగా, మరొకరు చనిపోయారని తెలిపారు.

ఈ దుర్ఘటనపై విచారణకు ఆదేశించినట్లు ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. మృతి చెందినవారి కుటుంబాలకు రూ.5లక్షలు, గాయపడినవారికి రూ.50వేలు నష్టపరిహారాన్ని అందజేయనున్నట్లు ప్రకటించారు. ప్రమాదంపై ప్రధాని మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రితో మాట్లాడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు తెలిపారు.



బావిలో నుండి క్షతగాత్రులను బయటకు తీస్తున్న సహాయక సిబ్బంది

ఎఎంసిల ఆదాయం కేంద్రానికి

- వ్యవసాయ చట్టాల కాలంలో 375 కోట్లు లాస్
- అడగని రాష్ట్ర సర్కార్
- రైతుల సౌకర్యాలకు దెబ్బ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కరోనా అని సైతం చూడకుండా కేంద్రం 2020లో ఆగమేఘాలపై తీసుకొచ్చిన నూతన వ్యవసాయ నల్ల చట్టాల వలన మన రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలు (ఎఎంసి) అక్షరాల 375 కోట్ల 25 లక్షల రూపాయల ఆదాయం కోల్పోయాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఎఎంసిల నుంచి రూ.617.74 కోట్ల ఆదాయం సాధించాలని లక్ష్యంగా నిర్ణయించగా రూ.242.49 కోట్లే లభించాయి. అంతకుముందు ఏడాది 2019-20 కంటే రూ.307.85 కోట్లు తగ్గాయి. అప్పుడు రూ.550.34 కోట్ల ఆదాయం వచ్చింది. 2020-21లో అంత తక్కువ ఆదాయం రావడానికి కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలే కారణమని ప్రభుత్వం నిర్ధారించింది. నల్ల వ్యవసాయ చట్టాల రద్దు కోసం ఢిల్లీ సరిహద్దుల్లో సంవత్సరానికిపైగా రైతుల నిరవధిక బైఠాయింపుతో కేంద్రం దిగొచ్చి చట్టాలను వెనక్కి తీసుకుంది. అయితే చట్టాలు అమల్లో ఉన్న కాలంలో రాష్ట్రంలోని ఎఎంసిలు రూ.వందల కోట్ల ఆదాయం కోల్పోవడంతో వాటి అభివృద్ధి కుంటుపడింది. దాంతో రైతులకు ఎఎంసిలు కల్పించే సౌకర్యాలు తగ్గాయి. మన ఎఎంసిలకు దక్కాల్సిన ఆదాయం కేంద్రం ఎగేసుకుపోయింది. ఆ లోటును పూడ్చమని రాష్ట్ర సర్కారు కేంద్రాన్ని కనీసం మాటమాత్రమైనా కోరలేదు.



చౌరబాటు నిజమైంది

ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ ఉత్పత్తులు, పశు గణాలు) మార్కెట్ల సమగ్ర చట్టం 1966లో రాగా, రూల్స్1969లో వచ్చాయి. ఆ చట్టం ఎఎంసిల కార్యకలాపాలను నిర్దేశించింది. ఎఎంసిలు తమ పరిధిలోని వ్యవసాయ, పశుగణ మార్కెట్లను నియంత్రిస్తాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 218 మార్కెట్ కమిటీలు, వాటి పరిధిలో మరో 324 ప్రకటిత మార్కెట్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. నోటిఫై చేసిన వ్యవసాయ, పశుగణాల ఉత్పత్తుల కొనుగోలుదారుల నుంచి, అనుమతి పొందిన లైసెన్స్‌దారుల నుంచి ఒక శాతం మార్కెట్ రుసుం వసూలు చేస్తున్నాయి. ఆ విధంగా సమకూరిన నిధులను మార్కెట్ కమిటీల పరిధిలో రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నాయి. కాగా కరోనా తొలిదశ వేళ ఇదే అదనుగా మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను రూపొందించి అత్యయిక ఉత్తర్వులు (ఆర్డినెన్స్) 2020 జూన్ 5న జారీ చేసింది. అదే ఏడాది నవంబర్‌లో పార్లమెంట్‌లో బిల్లులు ఆమోదింపజేసుకుంది. 27న రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. రైతులు ఉవ్వెత్తున ఆ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంలో 2021 జనవరి 12న వాటి అమలును తాత్కాలికంగా నిలిపేస్తూ సుప్రీం కోర్టు స్టే ఇచ్చింది. రైతుల ఆందోళనలతో మోడీ సర్కారు 2021 నవంబర్ 19న చట్టాలను ఉపసంహరించుకుంది. డిసెంబర్ 1న పార్లమెంట్‌లో చట్టాల రద్దు బిల్లు ఆమోదం పొందింది.

మార్కెట్ ఫీజు (రూ.కోట్లలో)

సంవత్సరం	లక్ష్యం	వసూలు
2019-20	574.70	550.34
2020-21	617.74	242.49
2022-23	624.57	473.00

(డిసెంబర్ వరకు)

ఆర్నెల్లలోనే...

నల్ల వ్యవసాయ చట్టాల్లోని ఫార్మర్స్ ప్రొడ్యూస్ ట్రేడ్ అండ్ కామర్స్ (ప్రమోషన్ అండ్ ఫెసిలిటేషన్) చట్టం రాష్ట్రాలు చేసిన ఎఎంసి చట్టాలను పూర్తిగా హైజాక్ చేసింది. రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్ కమిటీల వెలుపల దేశంలో ఎక్కడైనా స్వేచ్ఛగా అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తుందన్నది కేంద్రం ఉవాచ. వాస్తవానికి ఈ చట్టం వలన కార్పొరేట్లకు, వ్యాపారులకే ఉపయోగం. కేంద్రం ఆర్డినెన్స్ తెచ్చింది మొదలు పార్లమెంట్ ఆమోదించిన చట్టాల అమలుపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడానికి మధ్య కాలం కేవలం ఆరు మాసాలే. ఈ స్వల్ప వ్యవధిలోనే మన ఎఎంసిల ఆదాయానికి భారీ గండి పడింది.

మరో బిజెపి డర్టీ ఎమ్మెల్యే!

- త్రిపుర అసెంబ్లీలో పోర్న్ వీడియోలు చూసిన ఘనుడు

అగర్తలా : ప్రజాసమస్యలు ప్రస్తావించాల్సిన అసెంబ్లీలో బిజెపికి చెందిన ఓ డర్టీ ఎమ్మెల్యే ఫోన్‌లో అశ్లీల చిత్రాలను చూస్తూ అడ్డంగా దొరికిపోయాడు. మీడియా నివేదికల ప్రకారం, గురువారం అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు జరుగుతుంటే..

త్రిపురలోని బగ్‌బాసా నియోజకవర్గ ఎమ్మెల్యే జదబ్ లాల్ నాథ్ తన స్మార్ట్ ఫోన్‌లో పోర్న్ వీడియోలు చూసుకునే పనిలో బిజీ అయిపోయారు. ఇంతలో ఆయన వెనుక నుంచి ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అంతే ఈ వీడియో వైరల్ అయిపోయింది. అసెంబ్లీకి ఇలాంటి వాడినా ఎన్నుకున్నదని అక్కడి జనం అనుకుంటున్నారు. ఇది కుట్రపూరితంగా జరిగిందని, పార్టీకి వివరణ ఇస్తానని డర్టీ ఎమ్మెల్యే అంటున్నారు.



2012లో కర్ణాటకలోనూ ఇదే తంతు నడిచింది. అప్పటి బిజెపి ప్రభుత్వంలోని సహకార శాఖ మంత్రి లక్ష్మణ్ సవాది, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సిసి పాటిల్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా అశ్లీల వీడియోలు చూస్తూ పట్టుబడ్డారు. మంత్రుల నీలి చర్యను అసెంబ్లీ కార్యక్రమాలను కవర్ చేస్తున్న స్థానిక ఛానెల్ క్యాచ్ చేసింది.

ఇద్దరు చిన్నారులతో సహా తండ్రి ఆత్మహత్య

- బుక్కరాయసముద్రం చెరువులో మృతదేహాలు లభ్యం

కొత్త ప్రాజెక్టులపై అదాని వెనుకడుగు..!

- రెండు నెలల్లో కూలిన సామ్రాజ్యం

• లోపలి పేజీలో..

అరకొర కేటాయింపులతో వైద్యానికి సుస్తి

- నాడు-నేడులో రూ.3,300 కోట్లే ఖర్చు
- 104, 108 వ్యయంలోనూ కోతలే



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అత్యంత కీలకమైన వైద్యారోగ్య రంగాన్ని నిధుల కొరత వేధిస్తోంది. గత కొన్నేళ్లుగా వైద్యంపై ప్రభుత్వాలు అంతగా దృష్టి పెట్టడం లేదు. ఈ రంగానికి కేటాయిస్తున్న అరకొర నిధుల్లోనూ ఖర్చు చేస్తున్నది అంతంతమాత్రమే. వివిధ రంగాల కేటాయింపులు, ఖర్చుల మదింపుపై రాష్ట్ర ఆర్థిక శాఖ రూపొందించిన గణాంకాల్లో ఆందోళనకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. గత టిడిపి ప్రభుత్వం, నేటి వైసిపి ప్రభుత్వ హయాంలో కూడా వ్యయం తక్కువగా ఉన్నట్లు తేలింది.

2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు వైద్యానికి సంబంధించి మూడు కీలక రంగాలపై బడ్జెట్ కేటాయింపులు, చేసిన వ్యయం పరిశీలిస్తే చాలా అంతరం కనిపిస్తోంది. నాడు-నేడులో ఆస్పత్రుల అభివృద్ధి, మౌలిక సౌకర్యాల రంగంలో ఈ తొమ్మిదేళ్లలో రూ.10,526 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఇందులో కేవలం రూ.3,299 కోట్లు మాత్రమే వ్యయం కనిపించింది. 2014-15 నుంచి 2018-19 వరకు టిడిపి హయాంలో కేటాయింపులు రూ.1,747 కోట్లతో అతి తక్కువగా రికార్డవగా, వ్యయం రూ.114 కోట్లు నమోదైంది. 2019-10 నుంచి 2022-23 వరకు వైసిపి హయాంలో రూ.8,779 కోట్లు కేటాయించగా, రూ.2,185 కోట్లు మాత్రమే వ్యయం జరిగింది. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకానికి సంబంధించి కూడా కేటాయింపుల కన్నా వ్యయం తక్కువగా నమోదైంది. తొమ్మిదేళ్లుగా ఈ పథకాలకు రూ.11,477 కోట్లు కేటాయించగా, రూ.10,171 కోట్లు ఖర్చు చేశారు. ఇటీవల నాలుగేళ్లలో రూ.7,899 కోట్లకుగానూ రూ.5,695 కోట్లు మాత్రమే వ్యయం జరిగినట్లు లెక్కలు తేలాయి. 104, 108 సర్వీసులకు గానూ తొమ్మిదేళ్లలో రూ.1,859 కోట్లు కేటాయింపులు జరగ్గా, రూ.1,241 కోట్లు మాత్రమే వ్యయం జరిగింది. 2019-20 నుంచి ఇప్పటివరకు రూ.13,678 కోట్లు కేటాయించగా, కేవలం రూ.788 కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగారు.

నిధుల లేమి వల్లనే..

బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయిస్తున్నప్పటికీ, విడుదలలో మాత్రం ఆర్థికశాఖ విధానాలు సమస్యగా మారుతున్నాయి. శాఖల వ్యయం కన్నా ఇతర అవసరాలు పెరిగిపోతుండడంతో నిధుల విడుదల తగ్గిపోతున్నట్లు పలు శాఖల అధికారులు చెబుతున్నారు.

రంగాల వారీ నిధుల కేటాయింపులు, విడుదల (రూ.కోట్లలో)

విభాగం	కేటాయింపులు	వ్యయం
నాడు-నేడు	10,526	3,300
ఆరోగ్యశ్రీ, ఆసరా	11,477	10,171
104, 108 సర్వీసులు	1,859	1,241
మొత్తం	**23,862**	**14,712**

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ఎపి టీచర్స్ గిల్డ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపి టీచర్స్ గిల్డ్ అధ్యక్షులు బి చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి ఎల్‌కె చిన్నప్ప, నాయకులు సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న 810 ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎయిడెడ్ పాఠశాలల్లో 60 ఏళ్లు పూర్తయిన వారందరికీ గ్యాప్ పీరియడ్‌కు సంబంధించి జిఓలు ఇవ్వాలని కోరారు. విద్యార్థుల, ఉపాధ్యాయులకు సంబంధించి మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మృతిచెందిన ఎయిడెడ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కలెక్టరు పూల్‌లో కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎయిడెడ్ సిబ్బందికి కూడా హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలల్లోని ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ముగిసిన నారాయణస్వామి అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఉండి (పశ్చిమగోదావరి జిల్లా)

మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి అంత్యక్రియలు గురువారం పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం ఉప్పులూరులో అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు ఆధ్వర్యంలో నారాయణస్వామి భౌతికకాయంపై జాతీయ జెండాను ఉంచారు. డిఎస్‌పి ఎంవివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్చి గౌరవ వందనం సమర్పించారు. ఉప్పులూరులో యర్రా నారాయణస్వామి భౌతికకాయాన్ని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, పుప్పాల వాసుబాబు, డిసిసిబి చైర్మన్ పివిఎల్.నరసింహరాజు, సందర్శించి నివాళు ర్పించారు. ఆయన కుమారులు నవీన్, సూర్యచంద్రరావుకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాజధానిపై సిఎం మంకుపట్టు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని అంశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంకుపట్టు వీడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. అమరావతే రాజధానిగా కొనసాగిస్తూ స్పష్టమైన ప్రకటన చేయాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమరావతి రాజధాని ప్రాంత రైతులు, మహిళలు చేస్తున్న ఉద్యమం 1200 రోజులకు చేరిందని, చరిత్రలో కనీవినీ ఎరుగని ఉద్యమమైందని తెలిపారు. తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్న ఏకైక నేతగా జగన్ గత ఎన్నికల్లో ప్రజల్ని మభ్యపెట్టారని విమర్శించారు. అధికారంలోకి రాగానే మాట మార్చి, మడం తిప్పి మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగాది తరువాత విశాఖ నుంచి పాలన సాగిస్తామన్న జగన్‌కు ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా విశాఖలో చుక్కెదురైందని విమర్శించారు. 1200 రోజులు పూర్తయిన అమరావతి ఉద్యమానికి సంఘీభావం తెలిపేందుకు సిపిఐ భాగస్వామ్యం కానుందని వెల్లడించారు.

దేశంలో విజృంభిస్తున్న కరోనా ..

- 40 శాతం పెరిగిన కేసులు

న్యూఢిల్లీ : దేశంలో కరోనా విజృంభిస్తోంది. గత కొద్దిరోజులుగా వెయ్యికి పైగా కొత్త కేసులు నమోదవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా 24 గంటల వ్యవధిలో కొత్త కేసులు అమాంతం 40 శాతం పెరిగినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ గురువారం ప్రకటించింది. గడిచిన 24 గంటల్లో 3,016 కరోనా కేసులు నమోదైనట్లు తెలిపారు. సుమారు ఆరు నెలల తర్వాత ఈస్థాయి పెరుగుదల కనిపించింది. అదే సమయంలో 1,396 మంది కరోనా నుండి కోలుకున్నట్లు వెల్లడించింది. కరోనాతో 14 మంది మరణించారు. ఢిల్లీ ప్రభుత్వ హెల్త్ బులెటిన్ ప్రకారం.. గడిచిన 24 గంటలలో మొత్తం 300 కేసులు నమోదవగా, ఇద్దరు మరణించారు. గత ఏడాది ఆగస్టు 31 అనంతరం గురువారం భారీగా కేసులు నమోదవడం గమనార్హం. దీంతో వైద్య నిపుణులు, వైద్య శాఖ అధికారులతో ఢిల్లీ ఆరోగ్య మంత్రి సమావేశాన్ని నిర్వహించనున్నారు.

శాసనమండలి ఎన్నికల ఫలితాలపై పోస్ట్‌మార్టమ్

- ఏప్రిల్ 3న ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులతో సిఎం భేటీ
- గడపగడపకు మన ప్రభుత్వంపైనా సమీక్ష
- క్యాబినెట్ విస్తరణపైనా చర్చ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనమండలి, గ్రాడ్యుయేట్, శాసనసభ కోటా ఎమ్మెల్సీకి జరిగిన ఎన్నికల్లో ప్రతికూల ఫలితాల రావడం, ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో అతి తక్కువ మెజార్టీ రావడంపై ప్రభుత్వం పోస్టుమార్టమ్ మొదలుపెట్టింది. ముఖ్యంగా ఎమ్మెల్యే కోటా ఎన్నికలు ప్రభుత్వ నిలకడను దెబ్బతీసే స్థాయిలో ఉండటంతో భవిష్యత్ ప్రణాళికకు సిఎం సిద్ధమయ్యారు. ఈ మేరకు ఏప్రిల్ 3వ తేదీన ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు, కో ఆర్డినేటర్లతో సిఎం సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోటాలో మూడు చోట్ల మండలి ఫలితాలు 108 నియోజకవర్గాలలో ప్రభుత్వ పనితీరుకు, శాసనసభ కోటా అభ్యర్థి విషయంలో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై తిరుగుబాటుకు అద్దం పట్టేవిధంగా తీర్పు వచ్చిందని రాజకీయ విశ్లేషకులు చేస్తున్న వాఖ్యానాలు చేస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం అత్యంత కీలకంగా మారింది. తెలుగుదేశంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొనడం, అసెంబ్లీలో ఓట్లు లేకపోయినా టిడిపి అభ్యర్థి మంచుపర్తి అనురాధ విజయం సాధించడం పట్ల సిఎం ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టేరీతిలో ఏప్రిల్ 3న మరోమారు ఎమ్మెల్యేలు, నియోజక ఇన్‌ఛార్జిలు, రీజనల్ కో ఆర్డినేటర్లతో జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం జరుగుతుందని ఆపార్టీ వర్గాల అంచనా. ఇదే సమావేశంలో క్యాబినెట్ విస్తరణ, ఎవరెవరిని మంత్రివర్గంలోకి తీసుకుంటున్నారనే అంశాలపైనా సమాచారం ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది. ఫిబ్రవరి13న గడపగడపకు ప్రభుత్వంపై సమీక్షించిన జగన్మోహన్‌రెడ్డి మేనెల తర్వాత సమీక్ష వుంటుందని ఆలోపు అందరి పనితీరులో మార్పు రావాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే నెల తిరక్కుండానే మరోసారి సమీక్ష చేయాలనుకోవడం చర్చనీయాంశం అవుతోంది. పరిపాలనా రాజధానిని ఇస్తానన్న ఉత్తరాంధ్ర ప్రాంతంలో వైసిపి అభ్యర్థిపై టిడిపి అభ్యర్థి మొదటి ప్రాధాన్యతా ఓట్లలోనే 28,500 ఓట్లు ఎక్కువ వచ్చాయి. తూర్పు రాయలసీమ నియోజకవర్గం నుండి వైసిపిపై టిడిపి అభ్యర్థికి మొదటి ప్రాధాన్యతా ఓట్లలో 27,262 ఓట్లు అధికంగా వచ్చాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సీనియర్ మంత్రులు వున్నా తెలుగుదేశం అభ్యర్థులు సునాయస విజయం సాధించడం పట్ల వైసిపి శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. హైకోర్టును ఇస్తామన్న పశ్చిమ రాయలసీమ స్థానంలోనూ వైసిపి ఓటమి పాలయ్యింది. రాష్ట్రంలో 2019 ఎన్నికల తర్వాత ప్రతి ఎన్నికల్లో భారీ విజయాలను నమోదు చేసుకుంటూ తిరుగులేని నాయకత్వం కలిగిన నాయకుడిగా ముద్ర వేసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సొంత ఎమ్మెల్యేలే ఎదురు తిరగడంతో మూడోతేదీన జరిగే సమావేశం కీలకం కానుంది.

విద్యుత్ పొదుపులో ఎపి అద్భుత పనితీరు

- బిఇఇ కార్యదర్శి రాయ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ పొదుపు, ఇంధన సామర్థ్య ప్రాజెక్టులను అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అద్భుత పనితీరు కనబరిచిందని బిఇఇ కార్యదర్శి ఆర్‌కె రాయ్ అన్నారు. దేశంలోనే అగ్రగామి రాష్ట్రాల్లో ఎపి ఒకటని కొనియాడారు. ఇంధన సామర్థ్య కార్యక్రమం అమలు కోసం ఢిల్లీలోని ఎపి భవన్‌ను బిఇఇ ఎంపిక చేసింది. ఈ కార్యక్రమం పూర్తయిన సందర్భంగా ఆర్‌కె రాయ్ గురువారం విద్యుత్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంధన భద్రత, పర్యావరణ లక్ష్యాలను ఎపి సాధిస్తోందన్నారు. ఇంధన సామర్థ్య అమలు కోసం న్యూఢిల్లీలో బిఇఇ ఎంపిక చేసిన మొదటి రాష్ట్ర భవన్ ఎపి భవన్ అని తెలిపారు. కేవలం నెలరోజుల వ్యవధిలోనే ప్రాజెక్టును ఎపిఎస్ఇసిఎం పూర్తిచేసిందని పేర్కొన్నారు. ఇందులో వచ్చిన ఇంధన పొదుపు చర్యలు, ఫలితాల ఆధారంగా దశలవారీ న్యూఢిల్లీలోని ఇతర రాష్ట్ర ప్రభుత్వాల భవనాల్లో ఇదే తరహాలో ఈ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామన్నారు. నిర్ణీత కాలవ్యవధి కంటే ఈ ప్రాజెక్టును పూర్తిచేశామని ఎపిఎస్ఇసిఎం సిఇఒ ఎ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పూర్తయిన ప్రాజెక్టులో కాంట్రాక్టు డిమాండ్‌ను తగ్గించడం, వంటగదిలో ఇండక్షన్ ఉపకరణాలు, హీట్ పంపులు మొదలైన వాటిని పరిశీలించాల్సి ఉందని తెలిపారు. ఏటా 1.96 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేసేందుకు అవకాశం ఉందని, సుమారు 139 టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని అంచనా వేశామని పేర్కొన్నారు. ఇంధన సామర్థ్య చర్యల కోసం ప్రతిపాదించిన పెట్టుబడి కేవలం 13 నెలల వ్యవధిలోనే తిరిగి వస్తుందన్నారు.





భద్రాచలంలో రాములోరి కల్యాణోత్సవం పాల్గొన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు - విద్యుత్ కాంతులతో ఒంటిమిట్ట ఆలయం

వైభవంగా భద్రాద్రి రాములోరి కల్యాణం

- ఒంటిమిట్టలో అంకురార్పణ
- 9న కల్యాణం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉభయ తెలుగురాష్ట్రాల్లో శ్రీరామనవమి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. భద్రాచలంలో రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణో మహోత్సవానికి సమీప రాష్ట్రాల నుంచి వేలాది మంది యాత్రికులు తరలివచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మహోత్సవానికి హాజరై పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అంతకుముందు ప్రధానాలయంలో మూలవిరాట్‌కు సంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం సీతారాములను ఊరేగింపుగా భక్తుల కోలాటాలు, భాజా భజంత్రీల మధ్య మిథుల ప్రాంగణం వద్దకు తీసుకొచ్చారు. సీతమ్మ వారికి యోక్త్రధారణ చేశారు. 12 గంటలకు అభిజిత్ లగ్నం నందు రాములోరి కల్యాణాన్ని అర్చకులు నిర్వహించారు. భక్త రామదాసు వారు చేయించిన బంగారు ఆభరణాలను శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం సందర్భంగా ధరింపచేశారు. ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో...

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఒంటిమిట్ట కోదండరామస్వామివారి ఆలయంలో పదకొండు రోజులపాటు పాటు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఏకశిలపై వెలసిన సీతారామ, లక్ష్మణలను యాత్రికులు వేకువజామునుంచే దర్శించుకున్నారు. ఉత్సవ మూర్తులను తిరుమాడ వీధిలో ఊరేగించారు. ప్రభుత్వం తరపున మంత్రి అంబటి రాంబాబు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయనకు టిటిడి అధికారులు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి దంపతులు కూడా పట్టువస్త్రాలు సమర్పించారు.

పూర్తి సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్‌ను నడపాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన రా మెటీరియల్ కేటాయించి పూర్తి సామర్థ్యంతో నడపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారంనాటికి 777వ రోజుకు చేరాయి. దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యూఎటిడి, టెలికం, డీన్ యూయూ విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును అమ్మేయాలని ఆలోచన చేసిన మోడీ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బలిదానలతో నిర్మించుకున్న విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటు వారికి అమ్మాలని చూడడం అత్యంత దుర్మార్గం అన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు కొండా శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌కృష్ణ, గుప్తా, చిరంజీవి, గణేష్, శ్రీవర్మ, జయప్రకాష్, రాజబాబు, కె.శ్రీరామచంద్రరావు, వీరబాబు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

మల్లికార్జున్‌రెడ్డి (ఫైల్)

కృష్ణానదిలో ఈతకెళ్లి ఇద్దరు విద్యార్థుల మృతి


ప్రజాశక్తి-అమరావతి

కృష్ణా నదిలో ఈతకెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా అమరావతి మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకూరపాడు మండలం 75-తాళ్లూరుకు చెందిన కేసర రాజశేఖర్‌రెడ్డి (17), కొల్లి మల్లికార్జునరెడ్డి (17), కేసర నాగనితిన్‌రెడ్డి, మున్నంగి కార్తీక్‌రెడ్డి స్నేహితులు. వీరంతా గుంటూరులోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. పరీక్షలు ముగియడంతో సరదాగా గడిపేందుకు అమరావతికి వచ్చారు. కృష్ణానది ఒడ్డున అమరేశ్వర ఘాట్ సమీపంలో ఈతకు దిగారు. రాజవేఖర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి ఇద్దరూ ఇసుక కోసం తవ్విన గుంతలో మునిగి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గజఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ఓరుగల్లు సాహితీ శిఖరం.. 'బాలకిషన్‌రావు'కన్నుమూత

- తెలంగాణ సాహితి సంస్థ సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఓరుగల్లుకు చెందిన ఐదు దశాబ్దాల ప్రముఖ సాహితీవేత్త, కవి, న్యాయవాది నమిలికొండ బాలకిషన్‌రావు(73) గురువారం హన్మకొండలోని ప్రయివేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన ఇంటికే పరిమితమయ్యారు. హనుమకొండ సాహితీపరులకు కొండంత అండదండగా నమిలి కొండ రాష్ట్రవ్యాప్తంగా పరిచయం. చైతన్య సాహితి, సాంస్కృతిక సమాఖ్య సాహితీ సమితి, పోతన విజ్ఞాన పీఠం, కాళోజీ ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులుగా, రాజరాజ నరేంద్ర భాషా నిలయంలో క్రియాశీల సభ్యునిగా విశేష సేవ అందించారు. ప్రసరిక మాసపత్రిక ద్వారా నూతన తరానికి వేదిక కల్పించారు. సాహితీ సమితి వేదిక అధ్యక్షులుగా కూడా పనిచేశారు. కరీంనగర్ జిల్లా పూడూరులో నమిలికొండ నారాయణరావు, రత్నబాయి దంపతులకు నలమలి కొండ బాలకిషన్‌రావు 1950 సెప్టెంబర్ 6న జన్మించారు. ఎంఏ, ఎల్‌ఎల్‌బి, పట్టభద్రుడైన బాలకిషన్ హనుమకొండలో న్యాయవాద వృత్తి చేపట్టారు. వర్ధమాన రచయితలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 1982లో ప్రసారిక మాసపత్రికను నెలకొల్పారు. దాంతోపాటు ఆయన స్వీయ రచనలైన యువస్వరం (1981), అక్షర చిత్రాలు (1986), శాంతి సమత (1989) అక్షరాల్లో అనంతం (1990) అక్షర ప్రతిబింబం (2006), ప్రసారకీయ కుసుమాలు(2010) వెలువరించారు. సాహితీ సమితి వేదిక ద్వారా నమలికొండ అధ్యక్షులుగా పొట్లపల్లి శ్రీనివాసరావు కార్యదర్శిగా అనేక సభలు, సమావేశాలు, కవి సమ్మేళనాలు నిర్వహించి పుస్తక ప్రచురణలు గావించారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలామంది కవులకు సాహితీ సమితి ఒక వేదికగా నిలిచింది. ఇలా ఓరుగల్లు సాహితీ శిఖరంగా వెలుగొందిన నమలికొండ మరణం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటు అని తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జనార్ధన్, ఆనందాచారి సంతాపం తెలిపారు.

అంజన్‌ను వెంటనే విడుదల చేయాలి

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీసులు అక్రమంగా నిర్బంధించిన గన్నవరానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ యువకుడు పొందూరి అంజన్‌ను వెంటనే విడుదల చేయాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రిపై పోస్టు పెట్టారని అంజన్‌ను బుధవారం పోలీసులు తీసుకెళ్లారని తెలిపారు. ఇప్పటికీ ఆయన ఆచూకీ చెప్పకపోవడం నిబంధనల ఉల్లంఘనే అని పేర్కొన్నారు. వెంటనే డిజిపి తప్పుడు అధికారులపై చర్యలు తీసుకోవాలని, అంజన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

డిజిపికి వర్ల లేఖ

అంజన్‌ను వెంటనే విడుదల చేయించాలని డిజిపికి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య లేఖ రాశారు. ఎటువంటి కారణం చూపకుండా అంజన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఆయన తల్లిదండ్రులు గన్నవరం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా, వ్యక్తిగత విచారణ కోసం ఎస్‌పి కృష్ణ ముందు హాజరు పరిచారని చెప్పారని తెలిపారు. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదును స్వీకరించడానికి కూడా నిరాకరించారని పేర్కొన్నారు. కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారని తెలుస్తోందని అనుమానం వ్యక్తం చేశారు.

ఒంటిపూట బడులు నిర్వహించాలి : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 1 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయని, భానుడి ప్రతాపానికి బయటకు రావాలంటే పెద్దవాళ్లే భయపడుతున్నారని తెలిపారు. అలాంటిది చిన్న పిల్లలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ పాఠశాలల్లో ఎలా ఉండగలరని ప్రశ్నించారు. అకడమిక్ కేలండరు ప్రకారం మార్చి మొదటి, రెండో వారంలో ఒంటిపూడ బడులు ప్రారంభించడం దశాబ్దాలుగా అమలవుతోందని వివరించారు. మార్చి ముగుస్తున్నా ఇప్పటికీ నిర్వహించకపోవడం సమంజసం కాదని తెలిపారు. ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఒంటిపూట బడులకు ఎగనామం పెట్టారని స్పష్టంగా అర్థమవుతోందని ఆరోపించారు. ఎండలకు పిల్లలు అస్వస్థతకు లోనయ్యే ప్రమాదం ఉందనే కారణంతో ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారని, దీనిని మీరేలా ఆపుతారని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రశ్నించిన ఉపాధ్యాయులపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేయడం సిగ్గుచేటని అన్నారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఒక్క బడినైనా పూర్తిస్థాయిలో సందర్శించి పిల్లల ఇబ్బందులు తెలుసుకున్నారా? అని ప్రశ్నించారు. పది రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలంటే తమ వల్ల కాదని వైసిపి నేతలు కళ్లు తేలేస్తారని విమర్శించారు. చిన్నపిల్లలు మాత్రం మండే ఎండల్లో రోజంతా పాఠశాలల్లో ఉండాలా? అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులపై కక్షసాధింపు ధోరణి పక్కనపెట్టి ఒంటిపూట బడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

నెల నెలా 'షాక్'

(మొదటిపేజీ తరువాయి)

ఈ విధానంపై అభ్యంతరాలు, సలహాలు కోరుతూ ముసాయిదాను ఇఆర్‌సి విడుదల చేసింది. సిపిఎంతో పాటు పలు ప్రజాసంఘాలు, విద్యుత్ నిపుణులు కొత్త ట్రూఅప్ విధానాన్ని వ్యతిరేకిస్తూ అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఇఆర్‌సి పట్టించుకోలేదు. అన్ని కేటగిరీలకు యూనిట్‌కు 40 పైసలు చొప్పున వసూలు చేసుకునే ప్రతిపాదనకు అనుమతిచ్చింది. ఏప్రిల్ ఒకటోతేదీ నుండి ఈ విధానం అమల్లోకి రానుంది. ప్రతి నెలా వసూళ్లతోపాటు ఏడాది చివరలో ఇంధన సర్దుబాటు ఛార్జీకి మించి ఉంటే అదనంగా వసూలు చేసుకునే అవకాశం డిస్కమ్‌లకు కల్పించింది. అంటే ప్రతి నెల ట్రూఅప్‌తో పాటు మరలా ఏడాది చివరిలో మరో ట్రూఅప్ భారం ప్రజలపై మోపే అధికారం డిస్కంలకు ఉంటుంది. వీటిపై బహిరంగ విచారణ జరపాలన్న నిబంధన కూడా లేదు. డిస్కమ్‌లు ఎప్పుడు కావాలంటే అప్పుడు ట్రూఅప్ ధరల షాక్‌లను ప్రజలకు ఇవ్వొచ్చు. బొగ్గు ధరలు, విద్యుత్ కొనుగోలు ధర, ట్రాన్స్‌మిషన్ ధరలు పెరిగిన ప్రతిసారీ వీటిని వసూలు చేసుకోవచ్చని తెలిపింది. ఇప్పటికే రూ.2910 కోట్ల ట్రూఅప్ భారాన్ని గతేడాది ఆగస్టు నుంచి డిస్కమ్‌లు ప్రజల నుంచి వసూలు చేస్తున్నాయి. ఇది 2024 జనవరి వరకూ ఉంటుంది. మరో రూ.3,083 కోట్ల ట్రూఅప్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకూ వసూలు చేస్తారు. అంటే ఇప్పటికే ట్రూఅప్ పేరుతోనే రూ.5,993 కోట్లను ప్రజల నుంచి డిస్కమ్‌లు వసూలు చేస్తున్నాయి.

శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి

- తారాజువ్వలు పడి దగ్ధమైన పందిరి

ప్రజాశక్తి - తణుకు రూరల్

పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం అపశృతి చోటుచేసుకుంది. శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రమాదవశాత్తు చలువ పందిరి కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రమాదం జరగక పోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఆలయ ఇఒ సూర్యనారాయణ, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలోని వేణుగోపాలస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో గత నెలలో తాటాకు పందిళ్లు ఏర్పాటు చేశారు. అదే ఆలయ ఆవరణంలో సీతారామస్వామి ఆలయం కూడా ఉంది. శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా ఎదుర్కోలు ఉత్సవం సందర్భంగా బాణాసంచా కాల్చారు. తారాజువ్వలు ఎగిరి చలువ పందిరిపై పడటంతో మంటలు చెలరేగాయి. సందర్శకులు గమనించి ఆలయం లోపలి నుంచి అందరూ బయటకు పరుగులు తీశారు. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.



ఆలయ ప్రాంగణలో ఎగసిపడుతున్న మంటలు

ధాన్యం కొనుగోలులో పిచ్చి నిబంధనలు

- ఎపి కౌలు రైతు సంఘం విమర్శ
- అన్ని రూపాల్లోనూ ధాన్యం కొనాలని డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతుల వద్ద ఉన్న ధాన్యంతోపాటు, ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు మిల్లులకు తోలిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. తడిచిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనాలనీ, పిచ్చి పిచ్చి నిబంధనలన్నీ తొలగించాలనీ కోరింది. గురువారం విజయవాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు, కృష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు తదితరులు మాట్లాడారు. ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని టార్గెట్లు అయిపోయాయనే పేరుతో కొనుగోలు చేయలేదని తెలిపారు. ఆర్‌బికెల వద్దకు వెళ్లి కొనుగోలు చేయాలని కోరగా మిల్లులకు తోలుకోవాలని, ప్రభుత్వం ఆన్‌లైన్లో అవకాశం ఇచ్చినప్పుడు కొంటామని తెలిపారన్నారు. రైతు, కౌలు రైతుల ఆందోళన ఫలితంగా అవకాశం



ఇచ్చారని, కానీ మిల్లుల్లో ఉన్న ధాన్యం కొనొద్దని, కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. కృష్ణా జిల్లాలో 70 వేల టన్నుల ధాన్యం మిల్లుల్లో ఉందని, దాన్ని ఆన్‌లైన్ చేసి కొనుగోలు చేయాలని కోరారు. మాండూస్ తుపాను వల్ల ధాన్యం తడిచి రంగు మారిందని, ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని కోరారు. కేరళలో క్వింటాకు రూ.900, ఛత్తీస్‌గఢ్‌లో రూ.600 అదనంగా కేంద్రం ఇచ్చిన మొత్తానికి కలిపి ఇస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు కూడా రాష్ట్రంలో రైతులు పొందలేకపోతున్నారని, ప్రభుత్వం రైతాంగానికి అండగా ఉండాలని కోరారు. రైతులు పండించిన ధాన్యానికి అంచనావేసి సంచులు తీసుకెళుతున్నారని, మిగిలిన సంచులకు అంత మొత్తానికి డబ్బు కట్టాలని, సంచులు చాలకపోతే మిగిలిన ధాన్యాన్ని రైతు వద్దే ఉంచేసుకోవాలనే నిబంధనలు పెట్టారని తెలిపారు. ఇలాంటి పిచ్చి నిబంధన సరికాదని పేర్కొన్నారు. సంచులు, కాటా కూలి, రవాణా ఛార్జీలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఈ ఏడాది రవాణా ఛార్జీలు కూడా అందలేదని తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న మిర్చి, మొక్కజొన్న, అరటి, బొప్పాయి, పత్తి పంటల అంచనాకు కమిటీ వేశారని, అందులో రైతులుగానీ, వారి తరఫు ప్రతినిధులుగానీ లేకపోవడం అన్యాయమని తెలిపారు. ఇన్‌పుట్ ధరల పెరుగుదలకు అనుగుణంగా పరిహారం పెంచాలని, పంటలబీమా అమలు చేయాలని కోరారు. బ్యాంకుల నుంచి తెచ్చుకున్న అప్పులు వడ్డీ మాఫీ చేయాలని, పసుపు మరికొన్ని పంటలకు ప్రభుత్వం ప్రకటించిన ధర మార్కెట్లో లేదని, ధరల స్థిరీకరణ నిధి నుంచి మద్దతు ధర అందించాలని కోరారు.

బొలెరో వాహనాన్ని ఢీకొట్టిన దురంతో ఎక్స్‌ప్రెస్

- ఆరు గంటలకుపైగా నిలిచిన రైలు

ప్రజాశక్తి - భీమడోలు/ఉంగుటూరు (ఏలూరు జిల్లా)


ఏలూరు జిల్లా భీమడోలు రైల్వే గేటు వద్ద పట్టాలపై నిలిచిన బొలెరో వాహనాన్ని దురంతో ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తుండగా గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. దురంతో ఎక్స్‌ప్రెస్ వస్తుండడంతో భీమడోలు జంక్షన్ వద్ద సిబ్బంది రైలు గేటు వేశారు. అదే సమయంలో 216వ జాతీయ రహదారిపై నుంచి బొలెరో వాహనం అతివేగంగా గేటును ఢీకొట్టి పట్టాలపైకి వెళ్లి నిలిచిపోయింది. దురంతో ఎక్స్‌ప్రెస్ సమీపిస్తుండడంతో అందులోని వ్యక్తులు బొలెరో వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యారు.

రైలు ఢీకొట్టడడంతో ఆ వాహనం తునాతునకలైంది. రైలు ఇంజిన్ ముందు భాగం దెబ్బతినడంతో సుమారు ఆరున్నర గంటలసేపు రైలు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. రైల్వే సిబ్బంది మరో ఇంజిన్‌ను అమర్చడంతో రైలు విశాఖ చేరుకుంది. రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. బొలెరోకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు చిన్నారులతో సహా తండ్రి ఆత్మహత్య

- బుక్కరాయసముద్రం చెరువులో మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం (అనంతపురం)



మహమ్మద్ రఫీ, ఇమ్రాన్, సొహైల్

భార్యతో గొడవపడిన భర్త తన ఇద్దరు చిన్నారులతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురం నగరంలోని రంగస్వామి నగర్‌కు చెందిన మహమ్మద్ రఫీ (35), భాను దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇమ్రాన్ (9), సొహైల్ (6). రఫీ భవన నిర్మాణ కార్మికుడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం భానుతో రఫీ గొడవపడ్డాడు. అనంతరం తన ఇద్దరు చిన్నారులను తీసుకుని రఫీ బయటకు వెళ్లాడు. రాత్రి అయినా భర్త ఇంటికి రాకపోవడంతో కుటుంసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని చెరువులో మూడు మృతదేహాలను గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.రఫీ కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారమిచ్చారు. వారు వచ్చి మృతదేహాలను గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు సీట్లు గెలిస్తే అధికారంలోకి వస్తారా?

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

రెండు ఎమ్మెల్సీ సీట్లు గెలిచినంత మాత్రన పూర్తిస్థాయిలో అధికారంలోకి వస్తామనే భ్రమలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతున్నారని మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. కడపలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే పోలవరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మిస్తామని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు.

పొరుగు రాష్ట్రాల్లో చదివే విద్యార్థులకూ రీయింబర్స్‌మెంట్స్

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి - పెనుకొండ (సత్యసాయి జిల్లా)

తాము అధికారంలోకి వచ్చాక కర్నాటక, తమిళనాడులో చదివే ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంపై నిర్ణయం తీసుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర గురువారం సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం హరిపురం నుంచి ప్రారంభమైంది. యాత్ర గుట్టూరు గ్రామానికి చేరుకున్న సందర్భంగా 700 కిలోమీటర్లకు చేరుకుంది. ఈ సందర్భంగా గుట్టూరులో శిలఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వక్కలిగ సామాజిక తరగతుల వారితో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ..తాము అధికారంలోకి వచ్చాక దామాషా పద్ధతి ప్రకారం వక్కలిగ సామాజిక తరగతులకు నిధులు కేటాయిస్తామని హామీనిచ్చారు. వక్కలిగలను టిడిపి రాజకీయంగా ప్రోత్సహిస్తుందన్నారు. ఎన్‌టిఆర్ హయాంలో



గుట్టూరులో వక్కిలిగలతో మాట్లాడుతున్న నారా లోకేష్

హెచ్‌బి.నరసయ్యకు న్యాయశాఖ మంత్రిగా అవకాశం కల్పించామని తెలిపారు. వక్కలిగలను ఒబిసిలో చేర్చడంపై బిసి కమిషన్ నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీనిపై పార్టీ అధిష్ఠానంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మడకశిరలో వక్క మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు.

మడకశిర పరిధిలో టిడిపి హయాంలో పట్టు రైతులకు 1000 షెడ్లు నిర్మించామన్నారు. టిడిపి హయాంలో హంద్రీనీవా కాలువ పనులు 90 శాతం పూర్తి చేశామని, మిగిలిన పది శాతాన్ని కూడా పూర్తి చేయలేని దద్దమ్మ ప్రభుత్వం వైసిపి అని ఎద్దేవా చేశారు. టిడిపి హయాంలో తెలంగాణలో చదివే ఎపి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చామని గుర్తుచేశారు. అంతకుముందు హరిపురం గ్రామస్తులు, ఎర్రమంచి వద్ద కియా పరిశ్రమ ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.యాత్ర చెన్నేకొత్తపల్లి మండలం కోన మలుపు వద్ద విడిది కేంద్రానికి చేరుకుంది.

'జి-20'లో కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్

- పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చర్చ
- ముగిసిన సమావేశాలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ, విశాఖ

రెండవ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ (ఐడబ్ల్యుజి) సమావేశంలో భాగంగా ఇండియన్ జి-20 ప్రెసిడెన్సీ, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ సంయుక్తంగా గురువారం జి-20 ప్రతినిధుల కోసం కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ నిర్వహించాయి. ఈ వర్క్‌షాప్‌లో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఫైనాన్సింగ్‌కు సంబంధించి అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులను, స్థానిక ప్రభుత్వాలకు సమ్మిళిత, స్థితిస్థాపకత, స్థిరమైన నగరాల కోసం అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఫైనాన్స్ చేయడానికి అవసరమైన సామర్థ్యాలపై చర్చించారు. సమావేశంలో నగరాలకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్సింగ్‌ను పెంపొందించడానికి తమ దేశాల్లో అవలంభిస్తోన్న ఉత్తమ పద్ధతులను సింగపూర్, దక్షిణ కొరియా, రష్యా, చైనా, యూరోపియన్ కమిషన్, భారతదేశానికి చెందిన నిపుణులు వివరించారు. సింగపూర్ సూత్రాలు, సమ్మిళిత, స్థితిస్థాపకమైన, స్థిరమైన నగరాలను నిర్మించడానికి వ్యూహాలను సింగపూర్‌లోని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఏజెన్సీ మాజీ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డైరెక్టర్ జనరల్ అహ్ తువాన్ లోహ్ వివరిచారు. ఇందులో డైనమిక్ అర్బన్ గవర్నెన్స్ సిస్టమ్‌తో ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లానింగ్, అభివృద్ధి, వ్యర్థాలు - నీటి నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ, విద్య అంశాలు ఉన్నాయి. అనంతరం దక్షిణకొరియా ప్రతినిధులు ఇన్వీ కిమ్, హుయ్‌షిన్‌లు సియోల్ నగరం ఎదుర్కొన్న నిర్దిష్ట సవాళ్లను, తగ్గించడానికి అనుసరించిన వివిధ పునరాభివృద్ధి, పునరుద్ధరణ చర్యలను వివరించారు. చైనా, రష్యా, యూరోపియన్ కమిషన్, భారతదేశం నుంచి వచ్చిన ప్రతినిధులు పట్టణ మౌలిక సదుపాయాలకు ఫైనాన్సింగ్‌ను పెంచడానికి అనుసరించిన వివిధ చర్యలపై కేస్ స్టడీస్‌ను సమర్పించారు. స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్‌తో స్థిరమైన, సమ్మిళిత నీటి సరఫరా మెరుగుదలపై సభలో ప్రదర్శించారు.

సరస్సు పునరుజ్జీవనానికి సంబంధించి ముదర్సలోవా సరస్సును, పటిష్టమైన వాతావరణ స్థితిస్థాపకత కోసం 2 ఎండబ్ల్యు ఫ్లోటింగ్ సోలార్‌ను ప్రదర్శించడానికి, సమర్థవంతమైన ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రయివేట్ రంగ భాగస్వామ్యాన్ని హైలైట్ చేయడానికి, జిందాల్ వేస్ట్ నుంచి ఎనర్జీ ప్లాంట్ వరకు మూడు విజయవంతమైన ప్రాజెక్టులను సభలో ప్రదర్శించారు. సమావేశంలో 2023 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎజెండా కింద జరుగుతున్న చర్చలను పూర్తి చేసేందుకు ప్రాక్టికల్ లెర్నింగ్‌ను ప్రారంభించేందుకు భారత అధ్యక్ష కార్యాలయం చేస్తున్న ప్రయత్నాన్ని జి -20 ప్రతినిధులు అభినందించారు. ఈ వర్క్‌షాప్‌తో విశాఖపట్నంలో రెండు రోజుల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ సమావేశాలను విజయవంతంగా ముగిశాయి. తదుపరి సమావేశం 2023 జూన్ 26, 27, 28 తేదీల్లో ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో జరగనున్నాయి.

ఎఐ ప్రయోగాలు ఆపాలి

- 1000 మంది నిపుణుల లేఖ

వాషింగ్టన్ : ప్రజల ఉపాధి, ఉనికికే ముప్పు తెచ్చిపెట్టే కృత్రిమ మేధస్సు (ఎఐ) అభివృద్ధి, ప్రయోగాలను ఆపాలని ప్రపంచంలోని 1000 మంది నిపుణులు కోరారు. ఎఐని నిలిపివేయాల్సిన అవసరం ఉందని ట్విట్టర్ అధినేత ఎలాన్ మస్క్, ఆపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ వోజ్నియాక్ సహా 1,000 మంది నిపుణులు తమ సంతకాలతో 'పాజ్ జియాంట్ ఎఐ ఎక్స్‌పెర్‌మెంట్స్' పేరిట బహిరంగ లేఖ విడుదల చేశారు. దీన్ని 'ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్' తరపున విడుదల చేశారు. సంతకం చేసిన వారిలో చాట్‌జిపిటిని విమర్శిస్తున్న ప్రముఖులతో పాటు ఓపెన్‌ఎఐ ప్రత్యర్థి సంస్థల ప్రతినిధులు కూడా ఉన్నారు. ఇటీవల ఎఐ ఆధారిత చాట్‌బాట్ చాట్‌జిపిటిని అభివృద్ధి చేసిన ఓపెన్‌ఎఐ సంస్థ ఇటీవల జిపిటి-4 పేరిట మరింత అత్యాధునిక ఎఐ వ్యవస్థను ఆవిష్కరించింది. ఇది మొత్తం సమాజానికి తీవ్ర ప్రమాదాన్ని తలపెట్టే అవకాశం ఉందని నిపుణులు తమ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు

దుబాయ్ గోల్డ్ సౌక్‌లో మలబార్ స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ కొత్తగా దుబాయ్‌లోని గోల్డ్ సౌక్‌లో నూతన స్టోర్‌ను తెరిచినట్లు ప్రకటించింది. దీన్ని యుఎఇ ఆర్థిక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ మర్రీ ప్రారంభించారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా తమ సంస్థ నెట్‌వర్క్ 310 స్టోర్లకు విస్తరించినట్లు పేర్కొంది. తమ విశ్వసనీయ వినియోగదారులకు ఆదర్శప్రాయమైన ఆభరణాల షాపింగ్ అనుభవాన్ని అందించిన 30 ఏళ్ల వార్షికోత్సవాల సందర్భంగా నూతన స్టోర్‌ను తెరవడం సంతోషంగా ఉందని మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ ఇంటర్నేషనల్ ఆపరేషన్స్ ఎండి షామ్‌లాల్ అహమ్మద్ పేర్కొన్నారు.

దేశ్‌కా బచావో...మోడీ హటావో

- 14 నుంచి మే 15 వరకూ ప్రజాచైతన్య యాత్ర

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ 'దేశ్ కా బచావో-మోడీ హటావో' అన్న నినాదంతో ఏప్రిల్ 14వ నుంచి మే 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజా చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. తిరుపతిలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అన్ని రాజకీయ పార్టీలతో కలిపి త్వరలో ఉద్యమం చేపడతామని తెలిపారు. అదానీ కేసు తరహాలోనే, వివేకా హత్య కేసు కొలిక్కి వచ్చే సమయంలో సుప్రీంకోర్టు ద్వారా కమిటీ వేయించి సిఎం జగన్‌ను కేంద్రం బ్లాక్ మెయిల్ చేస్తుందని తెలిపారు. జగన్ సంపాదించిన అక్రమ డబ్బు మొత్తాన్ని కర్ణాటక ఎన్నికల్లో ఖర్చు చేయబోతున్నాడని చెప్పారు. బిజెపితో చేసుకున్న ఒప్పందంతో వివేకానందరెడ్డి హత్య కేసు తీర్పు ఆలస్యం కాబోతుందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. జయలక్ష్మి పాల్గొన్నారు.

సంపాదకీయం

నిరంకుశత్వంపై తిరుగుబాటు

ఎంతటి నిరంకుశ నేతలైనా ప్రజాగ్రహానికి తలొంచాల్సిందే. యూదు దుర్హంకార నేత నెతన్యాహు విషయంలో ఇది అక్షర సత్యం. న్యాయ సంస్కరణల పేరుతో న్యాయ వ్యవస్థను కుళ్లబొడిచి, దానిని నిర్వీర్యం చేయాలని చూసిన ఈ మితవాద నేతకు ఇజ్రాయిలీ ప్రజలు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. మూడు నెలలపాటు ఉవ్వెత్తున సాగిన నిరసనలతో అప్రతిష్టాకరమైన ఈ న్యాయ సంస్కరణల బిల్లును తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్టు పచ్చి నిరంకుశవాది నెతన్యాహు ప్రకటించక తప్పలేదు. అతి పెద్ద కార్మికసంఘం 'హిస్తాద్రుత్' సమ్మెలు, ఆందోళనలకు పిలుపునివ్వడంతో వైద్యం నుంచి విమానాల వరకూ సమస్త రంగాలు స్తంభించిపోయాయి. రాయబారులు, దౌత్య ప్రతినిధులుసహా సిబ్బంది అంతా సమ్మెలో పాల్గొనడంతో గత్యంతరం లేని స్థితిలో నెతన్యాహు ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఇజ్రాయిల్ ప్రభుత్వం గత కొన్ని దశాబ్దాలుగా అనుసరిస్తున్న దురాక్రమణ, జాతి ప్రక్షాళన వంటి చర్యలు ఇజ్రాయిలీ సెటిలర్లు, సైనికులు, రాజకీయ నాయకులకు వరంగాను, అక్కడ నివసిస్తున్న పాలస్తీనీయుల పాలిట శాపంగాను మారింది. దీనికితోడు అవినీతి ఊబిలో పీకల్లోతులో కూరుకుపోయిన నెతన్యాహు న్యాయవ్యవస్థ స్వతంత్రతనే హరించేలా వివాదాస్పద న్యాయ సంస్కరణల బిల్లును తీసుకొచ్చాడు. దీంతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. 'ఇజ్రాయిల్‌లో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి' అన్న పేరుతో చేపట్టిన నిరసనోద్యమానికి యూనివర్సిటీ విద్యార్థులు, యువత, ప్రగతిశీల, ప్రజాతంత్ర వాదుల నుంచి విశేషంగా మద్దతు లభించింది. దీంతో ఇజ్రాయిల్ గత కొన్ని వారాలుగా నిరసనలతో అట్టుడుకుతోంది. తాను ఏం చేసినా న్యాయ వ్యవస్థ ప్రశ్నించకూడదనే ధోరణి నరనరాన జీర్ణించుకున్న నెతన్యాహుకు తన ప్రజల నుంచే ఊహించని రీతిలో తిరుగుబాటు వచ్చేసరికి కంగుతిన్నాడు. యూదు దుర్హంకార ప్రభుత్వ దమనకాండకు ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ఇప్పటివరకు 87మంది పాలస్తీనీయులు బలయ్యారు. గడచిన సంవత్సరం ఇజ్రాయిలీ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌పై జరిపిన హేయమైన దాడిలో 146 మంది పాలస్తీనీయులు చనిపోయారు. ఇజ్రాయిల్ 1948లో ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పాలస్తీనా భూ భాగంలో 900కి పైగా కమ్యూనిటీలను (గ్రామాలు, పట్టణాలు) యూదులు ఏర్పాటు చేసుకున్నారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ ప్రభుత్వ నిరంకుశ పోకడలు పెరిగి పెరిగి, చివరికి ప్రజాస్వామ్యానికే ప్రమాదంగా పరిణమించాయి. 75 ఏళ్లుగా అనుసరిస్తూ వస్తున్న విధానాలతో ఇప్పటికే పెళుసుగా మారిన ప్రజాస్వామ్యాన్ని నెతన్యాహు ప్రభుత్వం మరింత నిర్వీర్యం చేయడానికి పూనుకోవడంతో ఇజ్రాయిలీ ప్రజలు మేల్కొన్నారు. నెతన్యాహు ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక ఎజెండాను సాగనిచ్చేది లేదంటూ పెద్దయెత్తున వీధుల్లోకి వచ్చారు. దేశంలో పౌరులందరికీ సమాన హక్కులు ఉండాలని, ఇజ్రాయిల్ యూదు దుర్హంకార రాజ్యంగా కాకుండా ప్రజాస్వామ్యయుత ఆధునిక రాజ్యంగా ఉండాలని ఎక్కువ మంది కోరుకుంటున్నారు. ఇదే వారినందరినీ ఏకం చేసి ప్రజాస్వామ్యం కోసం ఉద్యమించేలా ప్రేరేపించింది.

ఇజ్రాయిల్‌లో న్యాయవ్యవస్థపై జరిగిన దాడి వంటిదే మన దేశంలోనూ ఇక్కడి మితవాద బిజెపి ప్రభుత్వం చేస్తోంది. కొలీజియం వ్యవస్థకు వ్యతిరేకంగా ఉపరాష్ట్రపతి, న్యాయ శాఖ మంత్రి వంటి ఉన్నత రాజ్యాంగ పదవుల్లో వున్నవారు ఇటీవల చేస్తున్న ప్రకటనలు దీనిలో భాగమే. న్యాయమూర్తుల నియామకాన్ని ప్రభుత్వమే శాసించాలని నెతన్యాహు వాదించినట్టుగానే ఇక్కడ మోడీ ప్రభుత్వం కూడా వాదిస్తున్నది. ఇందుకోసం సెర్చ్ కమిటీ పేరుతో ఒక దానిని తెరపైకి తేవాలని చూసింది. సెర్చ్ కమిటీలో ప్రభుత్వ ప్రతినిధులే ఎక్కువగా ఉంటారు. కాబట్టి ఆ కమిటీ ద్వారా న్యాయవ్యవస్థలో తన మనుషులను నియమించుకోవాలని, తద్వారా న్యాయ వ్యవస్థను తన గుప్పెట్లో పెట్టుకోవచ్చని పన్నాగం పన్నింది. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన సుప్రీం కోర్టు ఆదిలోనే దీనికి బ్రేక్ వేసింది. అయినా, న్యాయవ్యవస్థ స్వతంత్రతను హరించేందుకు నిరంతరం కుట్రలు పన్నుతున్న బిజెపి, ఆరెస్సెస్‌లకు ఇజ్రాయిల్ పరిణామాలు ఒక హెచ్చరిక కావాలి.

మహనీయుల మాట



మేధావులు మౌనం వహించినప్పుడు మూర్ఖుల సంఖ్య రెట్టింపు అవుతుంది. ఇది ఎదిగే సమాజ ఉనికికే ప్రమాదం.

- నెల్సన్ మండేలా

వ్యాఖ్య

గ్రామీణ ఉపాధి హామీ పథకం గొంతు నులమొద్దు

మోడీ ప్రభుత్వం 2014లో ఏర్పడినప్పటి నుండి గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్) గొంతు నులిమేందుకు ఏదో రకంగా ప్రయత్నిస్తూనే వుంది. ఆర్థిక వ్యవస్థ మరింత 'సమర్ధవంతంగా', 'ఉత్పాదకంగా' పని చేసేలా మార్గనిర్దేశనం చేయాలంటే ప్రైవేటు రంగాన్ని అనుమతించాలని, అందుకుగాను ప్రభుత్వ వ్యయంలో కోత పెట్టాలని నయా ఉదారవాద సిద్ధాంతం పేర్కొంటున్నది. దీనికి కట్టుబడిన మోడీ ప్రభుత్వం క్రమం తప్పకుండా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో సహా వివిధ సంక్షేమ పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో కోత పెడుతూ వస్తోంది. అంతేకాకుండా పథకాల గొంతు నులిమేందుకు ఇతర మోసపూరిత చర్యలను కూడా చేపడుతోంది.

ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ విషయానికి వస్తే, 2022-23 సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.73 వేల కోట్లు కేటాయింపులు జరపాలని ప్రతిపాదించబడింది. కానీ, వాస్తవానికి రూ.89,400 కోట్లు ఖర్చు చేసి వుంటారని అంచనా. అంతకు ముందు సంవత్సరం 2021-22లో ఖర్చు పెట్టిన రూ.98,467.85 కోట్లలో దాదాపు పది శాతం తక్కువ. అయితే 2023-24 బడ్జెట్‌లో కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. గతేడాది సవరించిన అంచనా కేటాయింపులో ఏకంగా 33 శాతం కోత పెట్టారు.

ప్రభుత్వం ఈ పథకానికి కేటాయింపులు తగ్గించడం ఒక్కటే కాదు. పలురకాల కొర్రీలు పెడుతోంది. ఈ ఏడాది జనవరిలో, ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ కార్మికులు తప్పనిసరిగా అటెండెన్స్ (హాజరు) నమోదు చేయాలంటూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీస్ (ఎన్.ఎం.ఎం.ఎస్) పేరుతో మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. దీంతో దేశవ్యాప్తంగా పని ప్రదేశాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటర్‌నెట్ కనెక్టివిటీ సరిగా లేకపోవడంతో కార్మికులు తమ హాజరును నమోదు చేయడం కోసమే గంటల తరబడి ప్రయాస పడాల్సి వస్తోంది. హాజరు పడకపోతే, ఆ రోజుకు వారి వేతనం నష్టపోతారు కాబట్టి ఇది వారికి జీవన్మరణ సమస్యగా మారింది. పథకంలో జరుగుతున్న మోసాన్ని ఎదుర్కొనడానికంటూ ఈ తరహా హైటెక్ చర్యలను కార్మికులపై బలవంతంగా రుద్దడం ప్రభుత్వ కుట్ర మినహా మరొకటి కాదు. పిడిఎస్ పంపిణీలో కూడా గతంలో ఇదే పద్ధతిని రుద్దారు. ప్రభుత్వ పాఠశాల టీచర్ల హాజరు విషయంలోనూ ఇలాగే చేశారు.



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ఈ పథకంలో ఈ ఏడాది సగటు పనిదినాల సంఖ్య కేవలం 47 మాత్రమే. కనీసం ఏడాదిలో వంద రోజులు పని కల్పించాలని చట్టం పేర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పని కల్పించింది అందులో సగం కూడా లేదు. ప్రాణాంతకంగా మారిన ఈ ఆంక్షలకు తోడు, తక్కువ వేతనాలు. అది కూడా సమయానికి సరిగా అందని వేతనాలు, డిజిటల్ అడ్డంకులు, సరిపడా పని దినాలు లేకపోవడం...ఇవన్నీ కలిసి ఈ పథకం కింద పని దొరకబుచ్చుకుంటున్న కుటుంబాల సంఖ్య తగ్గిపోవడానికి దారితీసింది.

వీటన్నిటివల్లా ప్రజలకు గందరగోళ, విచారకర పర్యవసానాలే కలుగుతున్నాయి. కనెక్టివిటీ సమస్యలతో పాటుగా ఆధార్ సరిపోలడం లేదని, బ్యాంక్ ఖాతా నెంబరు కలవడం లేదని, చేతి వేళ్ళ గుర్తులు పడడం లేదని, ఇంకా ఇలాగే అనేక సమస్యల కారణంగా పిడిఎస్ రేషన్ వేలాది మందికి అందకుండా పోయింది. ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ కార్మికులు సైతం ఇలాంటి సమస్యలనే ఎదుర్కొంటున్నారు. ఇటువంటి నిబంధనల కారణంగా కార్మికులు పని కోసం ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ ను ఆశ్రయించడం తగ్గిపోతున్నది.

వేతనాల్లో నిరంతరం జరుగుతున్న జాప్యం కార్మికులకు ఎదురవుతున్న మరో సమస్య. ఒకోసారి అనుమతించిన 15 రోజుల వెసులుబాటును కూడా మించి జాప్యం జరుగుతోంది. ప్రస్తుత సంవత్సరంలో 15 అంతకుమించి రోజుల జాప్యం తర్వాత రూ.3630 కోట్ల వేతనాలు చెల్లించారు. ఇంకా రూ.1010 కోట్ల వేతనాలు పెండింగ్‌లో వున్నాయని ప్రభుత్వ డేటా పేర్కొంటోంది. చాలా తక్కువ కూలికి పనిచేసే కార్మికులకు ఈ స్థాయిలో ఇలా వేతనాలు పెండింగ్‌లో పెట్టడమనేది ఏ మాత్రమూ సహించరాని విషయం. దీంతో వారు తరచుగా తక్షణమే డబ్బులు చేతికి అందివచ్చే పనులను ఎంచుకుంటున్నారు. ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ వేతనాల కన్నా తక్కువే వచ్చినా వారు దానికే మొగ్గు చూపుతున్నారు. ఈలోగా ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనాలను 2 నుండి 10 శాతం మధ్య పెంచుతున్నట్లు చాలా అట్టహాసంగా ప్రకటించింది. అంటే రోజుకు రూ.7 నుండి రూ. 26 వరకు పెరుగుతాయి. గత అనేక మాసాలుగా ద్రవ్యోల్బణం 6-8 శాతం మధ్యలో వుంది. ఆహార ద్రవ్యోల్బణం ఇంకా ఎక్కువగా 8-10 శాతం మధ్య వుంది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఈ అధిక ద్రవ్యోల్బణం తగ్గుతుందని విశ్వసించడానికి ఒక్క కారణం కూడా కనిపించడం లేదు. ఇక కార్మికుల వేతనాల పెంపు అమలు కూడా రాబోయే ఆర్థిక సంవత్సరం నుండే. వాస్తవానికి, వ్యవసాయ కార్మికులకు అలాగే వ్యవసాయేతర కార్మికులకు ప్రస్తుతమున్న వేతనాల రేట్ల కన్నా ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ వేతనాలు చాలా తక్కువగా వున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ పనులకు సంబంధించి సగటు దినసరి వేతనం కేవలం రూ.217.87. అదే సమయంలో పురుష వ్యవసాయ కార్మికులకు రూ.349.77 అని ఆర్‌బిఐ పేర్కొంది.

అలాగే ఈ పథకంలో ఈ ఏడాది సగటు పనిదినాల సంఖ్య కేవలం 47 మాత్రమే. కనీసం ఏడాదిలో వంద రోజులు పని కల్పించాలని చట్టం పేర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పని కల్పించింది అందులో సగం కూడా లేదు. ప్రాణాంతకంగా మారిన ఈ ఆంక్షలకు తోడు, తక్కువ వేతనాలు. అది కూడా సమయానికి సరిగా అందని వేతనాలు, డిజిటల్ అడ్డంకులు, సరిపడా పని దినాలు లేకపోవడం...ఇవన్నీ కలిసి ఈ పథకం కింద పని దొరకబుచ్చుకుంటున్న కుటుంబాల సంఖ్య తగ్గిపోవడానికి దారితీసింది.

అధికారిక సమాచారం ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద పని దొరికిన వారు 8.6 కోట్ల మంది వుండగా, గతేడాది ఈ సంఖ్య 10.6 కోట్లుగా వుంది. అంటే గతేడాది కన్నా 2 కోట్లు (దాదాపు 20 శాతం) తగ్గింది. పైగా ఈ పథకంలో పని కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 1.6 కోట్ల మంది కార్మికులు తర్వాత పని లోకి వెళ్లకుండా వెనుదిరిగారు. అలాంటి వారిని పరిగణన లోకి తీసుకోకుండా వేసిన లెక్క ఇది.

తక్కువ వేతనాలు, సరిపడా పని దినాలు లేకపోయినా ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ అనేది కోట్లాదిమంది కుటుంబాలకు జీవనాధారంగా వుంది. ఈ పథకంలో ఇచ్చేది అతి తక్కువ వేతనాలే అయినప్పటికీ అవే వారికి ఎంతో విలువైనవి. ఎందుకంటే దేశంలో ఎలాంటి ఉపాధి అవకాశాలు లేవు. పైగా పెరుగుతున్న ధరలు కుటుంబాల బడ్జెట్‌ను ధ్వంసం చేస్తున్నాయి. ఫలితంగా ఆర్థిక సంక్షోభమనేది ఎడతెగకుండా వుంది. వేతనాలు, పని దినాలు పెంచుతూ, పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తూ, ఉపాధి హామీ పథకాన్ని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఇప్పుడు నెలకొంది. దీనితో పిల్లికి చెలగాటం, ఎలకకు ప్రాణ సంకటంగా మారిన ఆటకు అంతం పలకాలి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

జనవాక్యం

కాలం చెల్లిన బస్సులతో ప్రమాదం

రాష్ట్ర వ్యాప్తంగా బస్సులకు సరైన మరమ్మతులకు నోచుకోక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా సంవత్సరాల తరబడి తిరుగుతున్న ఈ బస్సులను నిబంధనల ప్రకారం అసలు వినియోగించకూడదు. అయినా మన పాలకులు స్పందించట్లేదు. మరోవైపు అధ్వానపు రహదారులు. వీటి దయనీయ పరిస్థితి గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని మరీ ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. వెంటనే కాలం చెల్లిన బస్సులను ప్రజా రవాణాకు ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలి. కాలం చెల్లిన బస్సులపై ఇప్పటికైనా దృష్టి సాదించాలి.

- ఉప్పలపు శేషునాథ్,
పి నైనవరం గ్రామం, కృష్ణా జిల్లా.

ఏది తప్పు? ఏది ఒప్పు?

రాష్ట్ర శాసనమండలికి జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత వైసిపి నేతలు ఎవరికి తోచిన ప్రకటనలు వాళ్ళు చేస్తున్నారు. తాజాగా శాసనసభ డిప్యూటీ స్పీకర్ తాము తప్పులు చేశామని, ప్రజా విశ్వాసం కోల్పోయామని, తప్పులు సరిదిద్దుకుంటామని సెలవిచ్చారు. సరిదిద్దుకోవడానికి ఏది తప్పు, ఏది తప్పు కాదో ఆయనెలా నిర్ధారించగలరు? ఉదాహరణకు శాసనమండలి రద్దు, ఆ తర్వాత రద్దు ఉపసంహరణ! అలాగే రాజధాని అమరావతే అని ఎన్నికల సందర్భంలో చెప్పారు. అధికారం లోకి వచ్చాక మూడు రాజధానులన్నారు. శాసనసభలో తీర్మానం చేశారు! మరల ఆ తీర్మానాన్ని ఉపసంహరించుకున్నారు! ఆపైన అదే అంశంపై కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు! న్యాయస్థానాల నుంచి గ్రామాల్లో నిరక్షరాశ్యుల వరకు రాష్ట్ర పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాలకులు తప్పులు దిద్దుకోకపోగా, మరిన్ని తప్పులు చేస్తున్నారు. ఇది సరికాదు.

- గరిమెళ్ల రామకృష్ణ,
ఏలూరు, ఏలూరు జిల్లా.

సందర్భం


కుల వివక్షను నిరసించిన 'మాలపిల్ల'

కరడు గట్టిన అగ్రవర్ణాల పెత్తనం కొనసాగుతున్న సమయంలో గూడవల్లి రామబ్రహ్మం ఈ 'మాలపిల్ల' చలన చిత్రం తీయడమన్నది గొప్ప సంచలనం! అది కూడా తెలుగు చలన చిత్ర నిర్మాణ ప్రారంభ దశలోనే తీయడం ఆశ్చర్యం కలిగించే విషయం. మనువాదుల ప్రభావంలో కొట్టుకుపోయిన దర్శక నిర్మాతలు, రచయితలు, కవులు సమాజాన్ని వెనక్కి నడిపించే చలన చిత్రాలు ఇప్పటికీ తీస్తున్నారు. మానవ హక్కుల్ని దెబ్బతీసే హింస, దౌర్జన్యాలు ఇప్పటికీ ప్రదర్శిస్తున్నారు. వీరంతా-85 ఏళ్ల క్రితమే మాలపిల్లను ఎంతో ధైర్యంగా చిత్రీకరించి ఘన విజయం సాధించిన గూడవల్లి రామబ్రహ్మం నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉంది! కనీసం తామెంత వెనకబడి ఉన్నామన్నది ఆత్మవిమర్శ చేసుకోవాలి.



తెలుగులో న్యూ సినిమా మూవ్‌మెంట్ ఇటీవలి కాలంలో మొదలైందని కొందరు అపోహపడొచ్చు. కానీ, అది నిజం కాదు. తెలుగు చిత్రాలు ప్రారంభమైన తొలిదశలోనే గూడవల్లి రామబ్రహ్మం ఆ పనికి శ్రీకారం చుట్టారు. 'భక్తప్రహ్లాద' వంటి పౌరాణికాలు ఒకవైపు నిర్మాణమవుతూ ఉంటే, జాతిని చైతన్యపరచడానికి మరోవైపు రామబ్రహ్మం కంకణం కట్టుకున్నారు. అంటరానితనం అడుగంటాలని, కుల వ్యవస్థను కూకటివేళ్ళతో పెళ్ళగించి వేయాలని ఒక మహోన్నతమైన సంస్కరణ వాదంతో రూపొందించిన చిత్రం 'మాలపిల్ల!' బ్రాహ్మణాధిక్యత గల అలనాటి సమాజంలో మాలల దుస్థితి ఎలుగెత్తి చెప్పడమే కాకుండా, ఇతర కులాలవారు వారిని పెళ్ళాడి వారిని మనుషులుగా గుర్తించాలని కూడా ఆ చిత్రం సూచించింది. పైగా, మనుషులంతా ఒక్కటేనన్న సందేశాన్నిచ్చింది.

తెలుగులో వెలువడ్డ మొదటి సాంఘిక చిత్రం-'ప్రేమ విజయం'. అది 1936లో వెలువడింది. కాని, విజయవంతం కాలేదు. రెండు సంవత్సరాల తర్వాత 1938లో వచ్చిన 'మాలపిల్ల' సామాజిక సంస్కరణకు ఉద్దేశించి వెలువడింది. ఆ చిత్రం తెలుగువారినే కాకుండా తమిళులను కూడా విశేషంగా ఆకర్షించింది. అవి భారత స్వాతంత్ర్యం కోసం అహింసా పద్ధతిలో పోరాటాలు సాగుతున్న రోజులు. సహాయ నిరాకరణోద్యమం, సత్యాగ్రహం నిత్యజీవితంలో భాగమైన రోజులు. ఆ రోజుల్ని, ఆనాటి సమకాలీన సాంఘిక పరిస్థితుల్ని యథాతథంగా చిత్తశుద్ధితో విప్లవ స్ఫూర్తితో ఆ చలనచిత్రాన్ని చిత్రీకరించారు గూడవల్లి రామబ్రహ్మం. "లేరా లేరా నిద్దుర మానర హరిజన వీర కుమారా / మానవులే నిను మాల మాలయని దూరము చేసిరి కదా?" అనే పాటతో చిత్రం ప్రారంభమవుతుంది. కళ్యాణపురం అనే కుగ్రామంలో గాంధీజీ అభిమానులు సమావేశం ఏర్పాటు చేస్తారు. జనం తండోపతండాలుగా దానికి వెళుతుంటారు. అందులో ఓ హరిజనుడు గొడుగు వేసుకుని వెళ్ళడం బ్రాహ్మణ పెద్దలకు నచ్చదు. పిలిచి, దుర్భాషలాడి చెప్పుతో కొడతారు. హరిజనుల్లో చలనం కలుగుతుంది. గాంధీజీ బోధనలతో ప్రభావితులై, బ్రాహ్మణాధిక్యతను సహించలేక - ఆలయ ప్రవేశాన్ని కోరుతున్న హరిజనుల్లో అసహనం పెల్లుబుకుతుంది. "పావనమౌ నీ గుడిలో పాదము పెట్టగనిమ్ము హరా / మహదేవ్, జై మహదేవ్, జై మహదేవ్" - అని ప్రార్థిస్తారు. తలుపులు తోసుకుని ఆలయంలోకి వెళ్ళడానికి ప్రయత్నిస్తారు.



డా॥ దేవరాజు మహారాజు

సనాతనవాది ఆలయ ధర్మకర్త మేడిచర్ల సుందర రామశాస్త్రికి విషయం తెలుస్తుంది. "మాలలు దేవాలయం అపవిత్రం చేస్తుంటే ఊరుకోవడమేనా ఛీ-బ్రాహ్మణులమై పుట్టి ఏం ప్రయోజనం?" - అని తన వాళ్ళను దూషిస్తాడు. "మీలో బ్రాహ్మణ రక్తం లేదూ?" అని ప్రశ్నిస్తాడు. సత్య దృష్టితో, దౌర్జన్యరహితంగా బ్రాహ్మణుల కళ్ళు తెరిపించాలని గాంధేయవాది చౌదరి హరిజనులకు సర్ది చెపుతుంటాడు. సమాధాన పరుస్తుంటాడు. కానీ, మరొక వైపు బ్రాహ్మణులు తమను తాము పొగడుకుంటూ ఉంటారు. "పికిలి పిట్ట, పేడ పురుగు ఒకటే అవుతుందా? సింహం, చీమ ఒకటే అవుతాయా?" - అని ప్రశ్నిస్తుంటారు. తమను తాము ఉన్నతంగా ఊహించుకుంటూ ఉంటారు. అంతే కాదు, పంచములు ఆదివాసులయ్యారనీ, వారే నేడు హరిజనులయ్యారని రేపు ఇంకా ఏం కాబోతారోనని రామశాస్త్రి హేళన చేస్తాడు. కిన్నెరలు, కింపురుషులు, బ్రహ్మరుషులు అవుతారేమోనని గేలి చేస్తాడు. అవసరమైతే బ్రాహ్మణులూ క్షాత్రం పూనగలరని హెచ్చరిస్తాడు. యుగయుగాలుగా తమదై ఉన్న ఈ తాత్విక సంపదను పరులకు ఎంత మాత్రమూ అంటగట్టబోమని స్పష్టం చేస్తాడు. అంతే కాదు, చెరువు నీళ్ళు హరిజనుల గూడేనికి పోకుండా కట్టుదిట్టం చేస్తాడు.

జీవుల గురించి, జీవుల ప్రత్యేకతల గూర్చి మొత్తానికి మొత్తంగా జీవ పరిణామం గురించి ప్రాథమిక అవగాహన లేనివారే సింహం, చీమ ఒకటి అవుతాయా? అని ప్రశ్నిస్తారు. కిన్నెరలు, కింపురుషులు వంటి వారు నిజంగా ఉండరని అవన్నీ మనువాదుల కల్పనలని తెలుసుకోని వారు అజ్ఞానంగానే ప్రశ్నలు కురిపిస్తారు. ఏమైనా తోటి మనుషులకు నీళ్ళు అందకుండా చేయడం ఎంతటి మూర్ఖత్వం? అగ్రవర్ణాల ఆధిపత్యం కొనసాగుతున్న రోజుల్లో అలా జరిగింది గానీ, ఈ ఆధునిక యుగంలోనైతే అది శిక్ష విధించాల్సిన నేరం!

కరడు గట్టిన అగ్రవర్ణాల పెత్తనం కొనసాగుతున్న సమయంలో గూడవల్లి రామబ్రహ్మం ఈ 'మాలపిల్ల' చలన చిత్రం తీయడమన్నది గొప్ప సంచలనం! అది కూడా తెలుగు చలన చిత్ర నిర్మాణ ప్రారంభ దశలోనే తీయడం ఆశ్చర్యం కలిగించే విషయం. మనువాదుల ప్రభావంలో కొట్టుకుపోయిన దర్శక నిర్మాతలు, రచయితలు, కవులు సమాజాన్ని వెనక్కి నడిపించే చలన చిత్రాలు ఇప్పటికీ తీస్తున్నారు. మానవ హక్కుల్ని దెబ్బతీసే హింస, దౌర్జన్యాలు ఇప్పటికీ ప్రదర్శిస్తున్నారు. వీరంతా-85 ఏళ్ల క్రితమే మాలపిల్లను ఎంతో ధైర్యంగా చిత్రీకరించి ఘన విజయం సాధించిన గూడవల్లి రామబ్రహ్మం నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉంది! కనీసం తామెంత వెనకబడి ఉన్నామన్నది ఆత్మవిమర్శ చేసుకోవాలి.

సరే-మళ్ళీ నాటి 'మాలపిల్ల' చలన చిత్రానికి సంబంధించిన విషయంలోకి వద్దాం! గాంధీ గారి మనుషులు ఒకవైపు హరిజనులకు నీరు సరఫరా చేస్తూ, మరోవైపు బ్రాహ్మణ వర్గానికి నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తుంటారు. గాంధేయవాది అయిన చౌదరి హరిజనులను రెచ్చగొడుతున్నాడని అపార్థం చేసుకుంటారు- బ్రాహ్మణులు! అద్దెకు ఉంటున్న ఆయన్ని ఇల్లు ఖాళీ చేయించి, వీధిన పడేస్తారు. ఆయన ధైర్యం కోల్పోకుండా 'మాలలు మాత్రం మనుషులు కారా?' అనుకుని వెళ్ళి మాలగూడెంలో బస చేస్తాడు. అంతే కాదు, వారిని సంఘటిత పరుస్తాడు. బ్రాహ్మణవర్గం దిగి వచ్చేదాకా సమ్మెకట్టి-సహాయ నిరాకరణోద్యమం కొనసాగించాలని ఉద్బోధిస్తాడు. కార్యకర్తలంతా కలిసి 'కూలీలందరూ ఏకం కావాలిరా' అని సమ్మె పాట పాడుతారు.

ఆలయ ధర్మకర్త సుందర రామశాస్త్రి కొడుకు నాగరాజు ఉన్నత విద్యా భ్యాసం చేసి వస్తాడు. గాంధీయిజం వంటబట్టించుకుంటాడు. అందుకు సంబంధించిన సమావేశాలకు వెళుతుంటాడు. అభ్యుదయ వాదిగా మారతాడు. సాయంత్రాలు ఆ ఊళ్ళో ఉన్న కొండపైకి వెళుతుంటాడు. అలా ఒక రోజు కొండ మీద తిరుగుతుండగా అక్కడ ఒక అమ్మాయిని చూస్తాడు. ప్రేమలో పడతాడు. ఆమె పేరు చంపాలత అనీ, ఆమె ఒక మాలపిల్ల అని తెలుసుకుంటాడు. తన చాదస్తపు తండ్రి లాగా అసహ్యించుకోకుండా హృదయ పూర్వకంగా అంగీకరిస్తాడు. ఆమెతో దేశాంతరం పారిపోయి పెళ్ళి చేసుకుని, మంచి ఉద్యోగంలో స్థిరపడతాడు. పనికిరాని సంప్రదాయాలను దరిచేరనీయకుండా ఆధునికంగా జీవిస్తుంటాడు. తన కొడుకు ఆ విధంగా చేయగలడనీ సుందర రామశాస్త్రి ఏ మాత్రం ఊహించడు. ఆయనా, ఆయన భార్యా కృంగిపోతారు. దేశంలో త్వరితగతిన చోటు చేసుకుంటున్న మార్పులు వారు జీర్ణించుకోలేరు. కానీ, క్రమ క్రమంగా వారిలో కూడా మార్పు వస్తుంది. చిత్రాంతంలో హరిజనులు కూడా మనుషులేనని సుందర రామశాస్త్రి గుర్తించి వారి ఆలయ ప్రవేశానికి ముహూర్తం నిశ్చయిస్తాడు. ఆ వార్త ఆనాటి తెలుగు ప్రముఖ దినపత్రిక 'ఆంధ్రపత్రిక'లో చదివిన కొడుకు, కోడలు-ఆ ముహూర్తానికి కలకత్తా నుండి తిరిగివస్తారు.

ఛాందస భావాలు గల సుందర రామశాస్త్రిగా డాక్టర్ గోవింద రాజుల సుబ్బారావు, కొడుకు నాగరాజుగా గాలి వెంకటేశ్వరరావు, మాలపిల్ల చంపాలతగా ఆనాటి అందాల తార కాంచనమాల నటించారు. బసవరాజు అప్పారావు గేయాల హక్కులన్నీ కొనేసి, గూడవల్లి రామబ్రహ్మం ఈ చిత్రంలో వాడుకున్నారు. "కొల్లాయి గట్టితే నేమి మా గాంధీ మాలడై తిరిగితేనేమి?", "నల్లవాడే గొల్ల పిల్లవాడే" వంటివే కాక, ఇంకా మిగతా పాటలన్నీ తాతాజీ -అంటే తాపీ ధర్మారావు రాసినవి. అంతే కాదు, చిత్రానికి సంభాషణలు సమకూర్చింది కూడా ఆయనే! తాపీవారి పేరు వినగానే చాలా మందికి 'దేవాలయం మీద బూతుబొమ్మలెందుకు?' 'ఇనుప కచ్చడాలు' 'పెళ్లి-దాని పుట్టు పూర్వోత్తరాలు' వంటి ఆయన పుస్తకాలు గుర్తుకు వస్తాయి. ఆ పుస్తకాల పేర్లు తెలియని ఈ కాలపు యువతీ యువకులు ఎవరైనా ఉంటే, సంపాదించి చదవడం మేలు. ఇకపోతే ఈ మాలపిల్ల చిత్రానికి కథను సమకూర్చింది మరో గొప్ప రచయిత గుడిపాటి వెంకటాచలం. శ్రీశ్రీ మహాప్రస్థానానికి ముందుమాట రాసినవాడు. మైదానం, దైవమిచ్చిన భార్య, ప్రేమలేఖలు, మ్యూజింగ్స్ వంటి ఎన్నో రచనలు చేసిన ఆయన, ఎన్నో వ్యంగ్య నాటికలు కూడా రాశాడు. 'హరిశ్చంద్ర' నాటికలో ఒక సీను ఉంటుంది - అందులో... భార్యను వేలం వేసి అమ్ముతున్న హరిశ్చంద్రునికి పిచ్చి పట్టిందని, ప్రజలంతా గుమిగూడి అతణ్ణి కట్టేసి తంతారు! ఈ ఒక్క దృశ్యంతో చలం ఆలోచనా ధోరణి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

చల్లపల్లి మహారాజా, గూడవల్లి రామబ్రహ్మం, యార్లగడ్డ శివరామ ప్రసాద్ నిర్మాతలు కాగా...భీమవరపు నరసింహారావు సంగీతం సమకూర్చారు. ఆనాటి పాత పాటలు చూడాలన్న అభిరుచి ఉన్నవారు యూట్యూబ్‌లో చూడొచ్చు. నాటి సామాజిక పరిస్థితులు, వాతావరణం కనిపిస్తాయి. సంకల్పం-బలంగా ఉంటే, ఎవరైనా ఎంతటి పనైనా చెయ్యొచ్చు. అందుకు గూడవల్లి రామబ్రహ్మమే గొప్ప ఉదాహరణ! ఆయన ఆనాటి ప్రసిద్ధ పత్రికా రచయిత మాత్రమే. జమీందారో లేక ఫిల్మ్ ప్రొడక్షన్‌లో పెద్ద అనుభవమున్న వాడో కాదు. అయినా, నాటి సమాజాన్ని తన శక్తిమేరకు సంస్కరించాలని 'మాలపిల్ల', 'రైతుబిడ్డ' వంటి ప్రయోజనకరమైన చలన చిత్రాల్ని రూపొందించాడు. ఆ ప్రయత్నం తక్కువదా?

/ వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త /

★

మెరుగుపడిన పోప్ ఆరోగ్యం



వాటికన్ సిటీ : పోప్ ఫ్రాన్సిస్ (86) ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని వాటికన్ న్యూస్ తెలిపింది. గత కొన్ని రోజులుగా పోప్ శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతుండటంతో ఆయనను రోమ్‌లోని జెమెల్లి ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం చేర్చారు. ఆరోగ్య పరీక్షల్లో ఆయనకు ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ సోకినట్లు నిర్ధారణైంది. ఆయన ఆరోగ్యం మెరుగుపడిందని, వైద్యులు పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నారని ఒక ప్రకటనలో వాటికన్ వర్గాలు పేర్కొన్నాయి.

బిసి జనగణన కోసం కేంద్రంపై ఒత్తిడి

- మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి
- సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి డి.రాజా, మంత్రి అథ్వాలేలకూ వినతులు



సీతారాం ఏచూరి, డి.రాజా, మంత్రి అథ్వాలేలకు వినతిపత్రం అందజేస్తున్న బిసి నాయకుడు శ్రీనివాస్ తదితరులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ జనాభాలో సగభాగమున్న బిసిలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని, బిసిల ఉద్యమానికి తమ పార్టీ మద్దతు ఉంటుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. సిపిఎం కేంద్ర కార్యాలయంలో ఏచూరిని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యాన ఆ సంఘం నేతలు గురువారం కలిశారు. అదేవిధంగా సిపిఐ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి రాజాను, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత సహాయ మంత్రి రాందాస్ అథ్వాలేని ఆయన నివాసంలో బిసి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా తమ ఉద్యమానికి మద్దతివ్వాలని కోరారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ.. బిసి జనగణన, మండల్ కమిషన్ సిఫార్సుల అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై సిపిఎం ఒత్తిడి పెంచుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై బిసిలు చేసే ఉద్యమానికి తమ పార్టీ మద్దతుగా ఉంటుందని తెలిపారు. డి రాజా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా బిసిల విషయంలో సానుకూలంగా వ్యవహరించాలని అన్నారు. బిసి రిజర్వేషన్ పెంచాలని, ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, చట్ట సభల్లో బిసి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బిసి ఉద్యమానికి పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్నప్పటికీ జనగణనలో బిసిలవైపే ఉంటామని కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథ్వాలే అన్నారు. బిసి జనగణన విషయంలో కేంద్రంతో తమకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. క్రీమిలేయర్ ఆదాయ పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు తాటికొండ విక్రం, యువజన సంఘం అధ్యక్షులు కనకాల శ్యామ్ కుర్మా, తెలంగాణ బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు జి మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు

- తొమ్మిదిమంది అమెరికా సైనికులు మృతి

వాషింగ్టన్: అమెరికాలో ఘోర ప్రమాదం చేసుకుంది. అమెరికా ఆర్మీకి చెందిన రెండు హెచ్‌హెచ్ 60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు కెంటకీ రాష్ట్రంలోని ట్రిగ్గ కౌంటీలో ఫోర్ట్ క్యాంప్‌బెల్ ప్రాంతంలో కుప్పకూలాయి. ఈ ఘటనలో తొమ్మిది మంది అమెరికన్ సైనికులు మరణించారు. అమెరికా కాలమానం ప్రకారం.. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. సైనికులు శిక్షణ పొందుతుండగా అకస్మాత్తుగా హెలికాప్టర్లు కుప్పకూలినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని, ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు. పోలీసులు, సహాయ సిబ్బంది ప్రమాదం జరిగిన ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఫోర్ట్ క్యాంప్‌బెల్‌లో అమెరికన్ సైన్యానికి చెందిన 101 ఎయిర్‌బోర్న్ డివిజన్ బేస్ క్యాంప్ ఉంది.

అమెరికా సమావేశంతో సైద్ధాంతిక విభజనలు

- రష్యా

మాస్కో : అమెరికా నిర్వహించిన 'ప్రజాస్వామ్య శిఖరాగ్ర సమావేశం' సైద్ధాంతిక విభజనలకు బీజం వేసిందని రష్యా విమర్శించింది. ఇతర దేశాలపై నియంత్రణ సాధించడానికి, ప్రపంచాన్ని విభజించడానికి ప్రజాస్వామ్య సమావేశాన్ని అమెరికా ఉపయోగించుకుందని, ఇతర దేశాలపై ప్రజాస్వామ్యం గురించి తన సొంత వివరణలను రుద్దే అమెరికా ప్రయత్నాలను రష్యా ఎప్పటికీ ఆమోదించదని తెలిపింది.

ప్రభుత్వాన్ని విమర్శిస్తే దేశ ద్రోహులు కారు

- కేంద్ర న్యాయ మంత్రికి 323 మంది సుప్రీం, హైకోర్టు న్యాయవాదుల లేఖ

న్యూఢిల్లీ : ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న కొందరు రిటైర్డ్ జడ్జిలను 'దేశ వ్యతిరేకులు'గా అభివర్ణిస్తూ కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు, హైకోర్టులకు చెందిన పలువురు న్యాయవాదులు స్పందించారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి సుప్రీంకోర్టుతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న వివిధ హైకోర్టుల నుంచి 323 మంది సీనియర్ అడ్వకేట్లు, న్యాయవాదులు లేఖ రాశారు. ప్రభుత్వాన్ని విమర్శించినంత మాత్రాన దేశానికి వ్యతిరేకమనో, దేశభక్తి లేనివారనో కాదని వివరించారు. కొందరు రిటైర్డ్ జడ్జిలు 'ప్రతిపక్ష పార్టీ పాత్రను పోషించడానికి యత్నిస్తున్నారు' అని ఇటీవల మీడియా కాంక్లేవ్‌లో పాల్గొన్న కిరణ్ రిజిజు అన్నారు. ఆ వ్యాఖ్యలపై అభ్యంతరం తెలుపుతూ న్యాయవాదులు తమ సంతకాలతో కూడిన లేఖను ఆయనకు రాశారు. వీరిలో సీనియర్ న్యాయవాదులైన ఇక్బాల్ చాగ్లే, రాజు రామచంద్రన్, కపిల్ సిబల్, దుశ్యంత్ దవే, చందర్ ఉదయ్ సింగ్, ఇందిరా జైసింగ్, రెబెక్క జాన్, నిత్య రామకృష్ణన్ ఉన్నారు. విమర్శకుల పేరెత్తకుండా వారిని 'భారత వ్యతిరేక ముఠా'గా అభివర్ణించిన కేంద్ర మంత్రి తన వ్యాఖ్యలతో రాజ్యాంగ పరిమితులను అతిక్రమించారని న్యాయవాదులు పేర్కొన్నారు. 'ఎవరూ తప్పించుకోలేరు', 'దేశానికి వ్యతిరేకంగా పనిచేసిన వారు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది' వంటి వ్యాఖ్యలతో కేంద్ర మంత్రి సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జిలను బెదిరించారని వివరించారు. కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రభుత్వమంటే దేశమని కాదనీ, దేశమంటే ప్రభుత్వమనీ కాదని వివరించారు. కేంద్ర మంత్రి తన వ్యాఖ్యలను బహిరంగంగా వెనక్కి తీసుకోవాలని వారు కోరారు. తన పదవిని బట్టి, దేశంలో కార్యనిర్వాహక, న్యాయ విభాగాల మధ్య వారధి కాబట్టి కేంద్రమంత్రి గౌరవప్రదంగా ప్రసంగాలివ్వాలని లేఖలో న్యాయవాదులు పేర్కొన్నారు.

కొత్త ప్రాజెక్టులపై

అదానీ వెనకడుగు..!

- రెండు నెలల్లో కూలిన సామ్రాజ్యం
- రూ.10 లక్షల కోట్ల సంపద ఆవిరి



న్యూఢిల్లీ : అమెరికన్ సంస్థ హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు భారత అపార కుబేరుడు, మోడికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న గౌతం అదానీ వ్యాపార సామ్రాజ్యం కకావికలం అయ్యింది. భవిష్యత్తు ప్రణాళికలు మరుగున పడ్డాయి అదాని గ్రూపు తీవ్ర ఆర్థిక అవకతవకలు, కార్పొరేట్ ఎకౌంటింగ్ మోసాలకు పాల్పడుతుందని జనవరి 24న హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌తో ఆ సంస్థ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.10 లక్షల కోట్లు (125 బిలియన్ డాలర్లు) తుడుచుకు పెట్టుకుపోయిందని బ్లూమ్‌బర్గ్ తాజాగా ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. మరోవైపు అదాని గ్రూపు అనేక లక్ష్యాలు, ఆశయాలు దెబ్బతిన్నాయని తెలిపింది. కొత్త రంగాలకు విస్తరించే ప్రణాళికలు నిలిచిపోయాయి. ఇప్పటికే భారీ అప్పుల ఊబిలో ఉన్న అదాని గ్రూపు నిధుల సమీకరణలో మరింత ప్రతికూలతను ఎదుర్కొంటుంది. పెట్రోకెమికల్స్ వ్యాపారాల నుంచి వెనక్కి తగ్గుతోందని, పశ్చిమ భారతదేశంలోని ముంద్రాలో 4 బిలియన్ డాలర్ల గ్రీన్‌ఫీల్డ్ కోల్ టు పాలీ వినైల్ క్లోరైడ్ ప్రాజెక్టుపై ముందుకు వెళ్లే అవకాశం లేదని ఈ వ్యవహారంతో దగ్గర సంబంధం ఉన్న వారు పేర్కొన్నట్లు బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. అదే విధంగా అల్యూమినియం, స్టీల్, రోడ్ ప్రాజెక్ట్‌లలోకి ముందుకు వెళ్లాలనే ఆశయాలను వెనక్కి తీసుకుందని సమాచారం. ప్రస్తుతమున్న విద్యుత్ ఉత్పత్తి, నౌకాశ్రయాలు, గ్రీన్ ఎనర్జీ రంగాలపై మాత్రమే దృష్టి సారించే అవకాశం ఉంది. ఇటీవల దొడ్డిదారిన ఎన్‌డిటివిని స్వాధీనం చేసుకున్న అదాని.. ఇకపై మీడియా సంస్థలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోవచ్చని తెలుస్తోంది. "హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో తీవ్ర స్థాయిలో నష్టపోయిన విశ్వాసాన్ని తిరిగి పొందడానికి అదాని ప్రయత్నించవచ్చు. ఇతర వాటాదారులు, పెట్టుబడిదారుల ఆందోళనపై ప్రధానంగా దృష్టి పెట్టవచ్చు." అని వాషింగ్టన్ ఆధారిత విల్సన్ సెంటర్‌లోని సౌత్ ఆసియా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ మైఖెల్ కుగెల్‌మాన్ పేర్కొన్నారు.

వ్యవసాయ వర్సిటీల్లో అక్రమాలపై విచారణ

- తరిగామి డిమాండ్

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని ప్రముఖ వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో నియామకాలు, ప్రమోషన్ల ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) నివేదికను అనుసరించి విచారణ జరపాలని సిపిఎం నాయకులు మహ్మద్ యూసఫ్ తరిగామి డిమాండ్ చేశారు. ఎస్‌కెయుఎఎస్‌టి జమ్ము, ఎస్‌కెయుఎఎస్‌టి కాశ్మీర్ విశ్వవిద్యాలయాల్లో ఉపాధ్యాయ ప్రత్యక్ష నియామకాలు, పదోన్నతులు, అర్హతలు నిర్ణయించడంలో అక్రమాలు జరిగాయని, యుజిసి నిబంధనలను ఉల్లంఘించారని ఇటీవల కాగ్ నివేదిక తెలిపింది. కాగ్ వ్యాఖ్యలు చాలా తీవ్రంగా ఉన్నాయని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించాలని, తద్వారా బాధ్యుల్ని గుర్తించవచ్చునని తరిగామి పేర్కొన్నారు.

'దహీ'పై నెగ్గిన 'తయిర్'

'పెరుగు' పేరుపై వెనక్కి తగ్గిన కేంద్రం

చెన్నై : తమిళ నాట ఆందోళనలతో భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ-ఫసీ) వెనక్కి తగ్గింది. తాజాగా గురువారం ఆ ఆదేశాలను వెనక్కు తీసుకుంటున్నట్లు ఫసీ తెలిపింది. పెరుగు ప్యాకెట్లపై కర్డ్ పేరుతో పాటు బ్రాకెట్‌లో దహీ, తయిర్, మోసారు వంటి ప్రాంతీయ భాషలను వినియోగించవచ్చని తెలిపింది.

'దహీ' పేరుపై తమిళనాట ఆగ్రహం

ఇటీవల తమిళనాడు మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ (టిఎంపిఎఫ్)కు 'పెరుగు' పేరుపై ఫసీ ఈ ఏడాది జనవరిలో కొన్ని ఆదేశాలు జారీ చేసింది. పెరుగు ప్యాకెట్లపై ఆంగ్లంలో ఉన్న 'కర్డ్', తమిళంలో ఉన్న 'తయిర్' పేర్లను తొలగించి.. 'దహీ' అని హిందీలోకి మార్చాలని ఆదేశించింది. తమిళనాడుతోపాటు కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు కూడా ఇలాంటి ఆదేశాలు పంపినట్లు సమాచారం. ఈ ఆదేశాలపై స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందీని బలవంతంగా రుద్దాలనే వారి పట్టుదల మరింత పెరుగుతోందని, చివరకు పెరుగు ప్యాకెట్‌పైనా స్థానిక భాషల్లో పేర్లను మార్చేసి హిందీలో రాయాలని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాతృభాషల పట్ల ఇలాంటి వైఖరి పనికిరాదని, దీనికి బాధ్యులైన వారిని దక్షిణాది శాశ్వతంగా బహిష్కరిస్తుందని స్టాలిన్ హెచ్చరించారు.

14న పెన్షన్ బిల్లుపై ఫ్రెంచ్ రాజ్యాంగ ధర్మాసనం రూలింగ్

పారిస్ : పదవీ విరమణ వయసును పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా వున్నాయా లేదా అనే అంశంపై ఏప్రిల్ 14న ఫ్రాన్స్ రాజ్యాంగ కౌన్సిల్ తీర్పు ఇవ్వనుంది. రిటైరయ్యే వయసును 62 నుండి 64కి పెంచాలని అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ తీసుకు వచ్చిన ప్రణాళికకు కార్మికులు, కార్మిక సంఘాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవు తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా నిరసనలు, ప్రదర్శనలు వెల్లువెత్తుతుండగా, ఏప్రిల్ 6న మరోసారి దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధమవుతున్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందనుకుంటే బిల్లును మొత్తంగా కొట్టిపారేసే అధికారం కౌన్సిల్‌కు వుంది. లేదా అందులో కొంత భాగాన్ని అయినా కొట్టివేయవచ్చు. మొత్తంగా బిల్లులను వ్యతిరేకించడం అరుదనే చెప్పవచ్చు. పరిస్థితులు సద్దుమణగాలంటే రాజ్యాంగ కౌన్సిల్ సమీక్ష జరిపేవరకు బిల్లును ఉపసంహరించాలని లేదా కొంతకాలం విరామం ఇవ్వాలని కార్మిక సంఘాలు మాక్రాన్‌ను కోరుతున్నాయి. యూనియన్లతో చర్చలు జరిపేందుకు సుముఖంగా వున్నామని ప్రభుత్వం చెబుతోంది. ఇతర అంశాలపై మాట్లాడతాం కానీ పెన్షన్ అంశంపై తమ వైఖరి కచ్చితంగా వుందని పేర్కొంటోంది. వచ్చే సోమ లేదా మంగళవారాల్లో కార్మిక సంఘాల ప్రతినిధులతో భేటీ అవుతామని ప్రధాని ఎలిజబెత్ బార్న్ చెప్పారు. సిఎఫ్‌డిటి యూనియన్ అధినేత లారెంట్ బెర్జర్ బుధవారం మాట్లాడుతూ, బిల్లును రద్దు చేయాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించేందుకు సమావేశానికి వెళతానని చెప్పారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ జనవరి మధ్య నుండి లక్షలాదిమంది ప్రజలు నిరసన ప్రదర్శనలు, సమ్మెల్లో పాల్గొంటున్నారు.

1 నుంచి నిరుద్యోగ భృతి

- చత్తీస్‌గఢ్ ప్రభుత్వ నిర్ణయం

రాయ్‌పూర్ : దేశంలో నిరుద్యోగ సమస్య రోజు రోజుకూ ఉధృతమవుతోంది. ఎన్నికల సమయంలో ఉద్యోగం లేని యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని భూపేష్ భఘేల్ హామీ ఇచ్చారు. ఏప్రిల్1 నుంచి నిరుద్యోగ యువతకు రూ.2,500 చొప్పున నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.దీని కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.250 కోట్ల మేర బడ్జెట్ కేటాయించింది. అంగన్‌వాడీ కార్యకర్తలు, హౌస్‌గార్డులు, గ్రామ కొత్వార్‌లు, ఇతర ఉద్యోగుల జీతాలు కూడా పెంచనున్నట్లు గతంలో సిఎం భూపేష్ భఘేల్ తెలిపారు. ఇది కూడా అమలయ్యే అవకాశం ఉంది.

నిరుద్యోగ భృతికి అర్హతలు

తప్పనిసరిగా ఛత్తీస్‌గఢ్ నివాసితులై ఉండాలి. 18 నుంచి 35 సంవత్సరాలు ఉన్న యువకులు, ఇంటర్ మీడియట్ పూర్తి చేసుకున్న యువకులు దీనికి అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల కంటే తక్కువ ఉండాలి. నిరుద్యోగ యువత ఛత్తీస్‌గడ్‌లోని సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ గైడెన్స్ సెంటర్, జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నమోదు చేసుకుని ఉండాలి.

తైవాన్ నేత పర్యటనపై

అమెరికాకు చైనా హెచ్చరిక

బీజింగ్ : తమ హెచ్చరికలను పట్టించు కోకుండా తైవాన్ నేతకు అమెరికా మీదుగా ప్రయాణించడానికి ఏర్పాట్లు చేసిన బైడెన్ ప్రభుత్వ చర్యను చైనా గురువారం తీవ్రంగా ఖండించింది. తైవాన్ ప్రాంతీయ నేత త్సాయి ఇంగ్ వెన్ గురువారం న్యూయార్క్ చేరుకున్నారు. ఇక్కడ అమెరికా అధికారులతో ఆమె భేటీ కాబోతున్నారు. మార్గమధ్యంలో న్యూయార్క్, కాలిఫోర్నియాల్లో ఆగడం పట్ల కూడా చైనా జాతీయుల నుండి తీవ్ర నిరసనలు వస్తున్నాయి. మన్‌హటన్‌లో ఆమె బస చేసిన హోటల్ వెలుపల గుమిగూడి త్సాయిని దేశ ద్రోహిగా అభివర్ణిస్తూ నినాదాలు చేశారు. అమెరికాలో వున్న తైవాన్ ప్రజలతో త్సాయి భేటీ కావడంపై చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ స్పందిస్తూ, అమెరికా, తైవాన్‌ల మధ్య ఏ రకమైనా అధికారిక కార్యాచరణనైనా చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఏ పేరుతోనైనా, ఏ సాకుతోనైనా తైవాన్ నేతలు అమెరికాలో పర్యటించడాన్ని వ్యతిరేకిస్తామని చెప్పారు. తైవాన్ ప్రాంతంతో అమెరికా ప్రభుత్వం అధికారిక సంబంధాలను పెట్టుకోవడాన్ని ఖండిస్తామన్నారు. చైనా పదే పదే హెచ్చరిస్తూ, వ్యతిరేకత వ్యక్తం చేసినా వాటితో నిమిత్తం లేకుండా త్సాయి పర్యటనకు అమెరికా ఏర్పాట్లు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రస్తుతానికి వున్న సమాచారం ప్రకారం, న్యూయార్క్‌లో తైవాన్ జాతీయులతో త్సాయి విందు సమావేశంలో పాల్గొంటారని భావిస్తున్నారు. కన్జర్వేటివ్ అమెరికన్ థింక్ ట్యాంక్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూడా పాల్గొననున్నారు. సెంట్రల్ అమెరికాలోని గ్వాటెమాలా, బెలిజె దేశాలకు బుధవారం బయలు దేరినట్లు తైవాన్ నేత త్సాయి చెప్పారు. ఈ పర్యటనలోని ముఖ్యోద్దేశం అమెరికా మీదుగా ప్రయాణించడమేనని అందరికీ స్పష్టమవుతోంది.

గతంలో ఆరుసార్లు పర్యటించిన ఆమె తన పదవీకాలం ముగుస్తుండడంతో, మరోసారి అమెరికా సందర్శించాలని భావించారు. అమెరికా మద్దతుతో తైవాన్‌లో ప్రభుత్వం నెలకొల్పాలని త్సాయి, డెమొక్రటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ (డిపిపి) అధికారులు ఈ రకంగా వ్యవహరిస్తున్నారు. తైవాన్ ప్రజల జీవనోపాధులు, సంక్షేమం, దీవి భవితవ్యాన్ని పణంగా పెడుతున్నామనే విషయం మర్చిపోతున్నారు.

చిన్నారి



మీకోసం




డబ్బాల్లో పిండి నింపేటప్పుడు దాన్ని అదిమి పెట్టకుంటే పురుగు పట్టకుండా ఉంటుంది.

జీవన సౌరభం

విజయవంతమైన ప్రతి వ్యక్తి వెనుక చిత్తశుద్ధి, నిజాయితీ తప్పక తోడుంటాయి.

తెలుగు అక్షరాలతో ఆడుకుంటాం



అఆ లతో ఆటలాడుతాం
ఇఈ లతో ఈతకొడతాం
ఉఊలతో ఊయలలూగుతాం
ఎఏ లతో ఏనుగునెక్కుతాం

ఒఓ లతో ఓమనగుంటలాడుతాం
కఖ లతో ఖండాలు చుట్టేస్తాం
గఘ లతో ఘనతకెక్కుతాం
చఛ లతో ఛత్రపతులౌతాం

జఝ లతో ఝరిలా ప్రవహిస్తాం
టఠ లతో ఠకీమనిపిస్తాం
డఢ లతో ఢంకామోగిస్తాం
తథ లతో థర్మల్ విద్యుత్తునిస్తాం


దధ లతో ధర్మంవైపు నడుస్తాం
పఫ లతో ఫలితాలు సాధిస్తాం
బభ లతో భూరలూదుతాం

మయ లతో యదార్థం పలుకుతాం

రల లతో లక్ష్యంతో దూసుకెళ్తాం
వశ లతో శక్తిమంతులౌతాం
షస లతో సరస్వతి బిడ్డలౌతాం !


- బోనగిరి పాండు రంగ
తొర్రూరు

బొమ్మ గీయండి!



చిన్నారులూ , ఈ రోజు అందమైన బాతు పిల్ల బొమ్మ గీయడం నేర్చుకుందాం. ఈ బొమ్మలో ఇచ్చిన అంకెలు ఆధారంగా బొమ్మ గీయండి.

నేను గీసిన బొమ్మ



ఎం. కౌశిక్, 4వ తరగతి,
పెన్నలపాడు ప్రాథమిక పాఠశాల,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వారంతా 'ప్రత్యేక' కళాకారులు..

పుట్టుకతోనే వైకల్య బాధితులు వారంతా.. కండరాల బలహీనతతో కాలు, చెయ్యి పని చేయకపోయినా గోడను దన్నుగా చేసుకుని ఎంతో శ్రద్ధగా సూది దారంతో వస్త్రాలపై కళాకృతులు కుడుతున్నారు. వారు తయారుచేసిన ఆ దుస్తులు దేశ విదేశాల్లో మంచి ఆదరణ పొందుతున్నాయి కూడా. వీరందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చి వారి జీవితాల్లో వెలుగులు పూయించిన వ్యక్తి కూడా కండరాల బలహీనతతో బాధపడుతున్న వ్యక్తే.. జమ్మూ కాశ్మీర్‌కు చెందిన తారీఖ్ అహ్మద్ మిర్ 'స్పెషల్ హ్యాండ్స్ ఆఫ్ కాశ్మీర్' పేరు మీద ఓ బృందాన్ని తయారుచేశారు. వారిలో 60 మంది ప్రత్యేక సామర్థ్యం గలవారే.





జమ్మూ కాశ్మీర్ బుద్గాం జిల్లా, గోటపోరా గ్రామంలో పుట్టిన తారీఖ్ పుట్టుకతోనే ప్రత్యేక సామర్థ్యం గలవారు. ఆయన ఇద్దరు సోదరులు కూడా ఆ వ్యాధితోనే జన్మించారు. వ్యాధి తీవ్రతతో 2019లో వారిలో ఒక సోదరుడు మరణించారు. 90 శాతం వైకల్యంతో సోదరులు ఇద్దరూ కదలలేకుండా ఉంటే, తారీఖ్ మాత్రం చిన్న ఆసరాతో నడిచేవారు. పుట్టిన దగ్గర నుండి ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న తారీఖ్, ఉర్దూలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు.

'2010లో నేను టీచర్ పోస్టుకు దరఖాస్తు చేశాను. జమ్మూ-కాశ్మీర్ సెలక్షన్ బోర్డు నిర్వహించిన ఆ పరీక్షలో షార్ట్ లిస్ట్‌లో నా పేరు ఉంది. అయితే వైకల్యం కారణంగా నా దరఖాస్తు తిరస్కరించినట్లు ఇంటర్వ్యూ సమయంలో అధికారులు చెప్పారు. నేను జనరల్ కోటాలో ఆ పోస్టుకు అర్హత సాధించానని వారికి చెప్పినా పట్టించుకోలేదు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రెండు కాళ్లు కదిలించలేని నాలాంటి వారికి ఈ ఉద్యోగాన్ని పొందే అర్హత లేదన్నారు. ఆ సమయంలో నేను ఎంతో బాధపడ్డాను' అంటున్న తారీఖ్ ఆ తరువాత తన భవిష్యత్తును తానే తీర్చిదిద్దుకోవాలనుకున్నారు. దశాబ్దాలుగా తండ్రి చేస్తున్న 'సోజ్ని' కళపై దృష్టిపెట్టారు. ఆ కళతో సమాజంలో గౌరవప్రదంగా జీవిస్తూ, కుటుంబానికి సాయంగా నిలవాలనుకున్నారు.

తనతో పాటు తనలాంటి వారికి కూడా మెరుగైన జీవితం అందించేందుకు రూ.5000ల పెట్టుబడితో 'స్పెషల్ హ్యాండ్ ఆఫ్ కాశ్మీరీ' పేరుతో ఓ బృందాన్ని తయారుచేశారు. ఇప్పుడు అందులో 500 మంది కళాకారులు ఉన్నారు. వారిలో సామాజికంగా, ఆర్థికంగా బాగా వెనుకబడిన 60 మంది సభ్యులు ప్రత్యేక సామర్థ్యం గలవారు. వీరిలో ఎక్కువ మంది కండరాల బలహీనతతో ఒక చోటు నుండి మరోచోటుకు కదలలేని వారు, రెండు కాళ్లు పనిచేయని వారు, వినికిడి సామర్థ్యం లేనివారే ఉన్నారు.

ప్రత్యేక బృందం తయారుచేసిన ఈ వస్త్రాలను మార్కెటింగ్ చేసుకునేందుకు తారీఖ్, సోషల్ మీడియాను ఆశ్రయించారు. అలా ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన ఈ ఎంబ్రాయిడరీ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. '2013లో ఢిల్లీకి చెందిన ఓ సంస్థ రూ.34,000 ఆర్డరు ఇచ్చింది. ఆ తరువాత యుఎస్ కాలేజీ నుండి ఆ కాలేజీ లోగోతో 40 మఫ్లర్లు ఆర్డరు వచ్చాయి. అలా మా ఉత్పత్తులు కాశ్మీర్ లోయలోనే కాదు దేశ విదేశాల్లో కూడా ఆదరణ పొందుతున్నాయి. అప్పటి నుండి ఇప్పటి వరకు మేం వెనుకడుగేయలేదు. పలు సంస్థలు, వ్యక్తుల నుండి పెద్ద మొత్తంలో ఆర్డర్లు వస్తున్నాయి' అంటూ ఎంతో సంతోషంగా చెబుతున్నాడు తారీఖ్.

'సాధారణంగా ఈ కళ వైపు కాశ్మీరీ యువకులు అంతగా శ్రద్ధ పెట్టరు. కానీ మా బృందంలో ఎక్కువమంది యువతే. వీరు తయారుచేసిన ఈ ఉత్పత్తులతో కళ సజీవంగా ఉండడమే కాదు, వారి జీవనోపాధి కూడా మెరుగుపడుతోంది. గౌరవప్రదమైన జీవితంతో పాటు ఇక్కడ చేరిన తరువాత వారి ఆర్థిక పరిస్థితి బాగుపడింద'ని తారీఖ్ గర్వంగా చెబుతున్నాడు.

విమర్శను, వ్యతిరేకతను సానుకూల దృక్పథంతో చూసిన తారీఖ్, తనను తాను నిరూపించుకుంటూ తనలాంటి వారికి గొప్ప మార్గదర్శకంగా నిలిచారు.

యాలకులు.. ప్రయోజనాలు..



- యాలకులు అనేక పోషకాలను కలిగి ఉంటాయి. వీటలో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. కార్బోహైడ్రేట్, ప్రొటీన్, కాల్షియం, పొటాషియం మొదలైనవి ఉంటాయి.
- రాత్రి పడుకునే ముందు వేడి నీటితో రెండు యాలకులు వేసుకొని ఆ నీరు తాగటం వల్ల కొవ్వు కరిగిపోతుంది.
- పచ్చి యాలకులు యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటాయి, వాటిని రోజూ తీసుకోవడం వల్ల బ్యాక్టీరియా వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది.
- యాలకులలోని పొటాషియం, పీచు పదార్థం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. రక్తపోటును అదుపులో ఉంచుతుంది.
- రోజూ యాలకులు తింటుంటే యూరిన్ ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉంటుంది.



జ్ఞాపకశక్తిని పెంచే ఆహారాలు ఇవే..

మితిమీరిన ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం ఆరోగ్యానికి హాని చేయడమే కాకుండా, జ్ఞాపకశక్తిని కూడా బలహీనపరుస్తుంది. జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి, ఒత్తిడిని జయించేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. శరీరానికి అవసరమైన కొన్ని విటమిన్లు, ఖనిజాలు కూడా ఆహారంలో ఉండేలా చేసుకోవాలి. జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి ఏయే విటమిన్లు, ఖనిజాలు ఉపయోగపడతాయో తెలుసుకుందాం.

విటమిన్ సి

గుడ్లు, మొలకలు, పుల్లని పండ్లు, బ్రోకలీ, బంగాళదుంపలు, స్ట్రాబెర్రీలు, కివి, ఎర్ర మిరియాలు, క్యాబేజీ, ఆకుకూరలు వంటి వాటిలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది.

విటమిన్ ఇ

డ్రై ఫ్రూట్స్, విత్తనాలు, తృణధాన్యాలు, వాల్‌నట్, ఆయిల్, గోధుమ గింజలు, మొలకలు మొదలైన వాటిని తీసుకోవచ్చు

మెగ్నీషియం

మెగ్నీషియం ఉన్న ఆహారాలు జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఆపిల్, సెలెరీ, చెర్రీస్, అత్తి పండ్లు, కూరగాయలు, బొప్పాయి, బఠానీలు, ఎండుద్రాక్ష, బంగాళదుంపలు, ఆకుకూరలు, వాల్‌నట్‌లలో మెగ్నీషియం పుష్కలంగా లభ్యమవుతుంది.

విటమిన్ బి 12

విటమిన్ బి 12 పుష్కలంగా ఉండే ఆహారాలు కూడా ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. పాలు, చికెన్, గుడ్లు, చేపల్లో విటమిన్ బి 12 అధికంగా ఉంటుంది.

లెసిథిన్

గుడ్డు సొన, బాదం, నువ్వులు, సోయాబీన్స్, తృణధాన్యాలు, గోధుమల్లో లెసిథిన్ ఉంటుంది.

ఫ్లేవనాయిడ్స్

ఉల్లిపాయ, క్యాబేజీ, బ్రోకలీ, కాలీఫ్లవర్, టర్నిప్ మొదలైన వాటిలో ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. నారింజ పండ్లు, మిరపకాయలు, బీన్ మొలకల్లో కూడా ఫ్లేవనాయిడ్స్ లభ్యమవుతాయి.

కెరోటినాయిడ్స్

క్యారెట్, మొలకలు, చిలగడదుంపలు, బచ్చలికూర, పాలకూర, ఎర్ర మిరియాలు, టొమాటోలు, నారింజ వంటి పండ్లలో కెరోటినాయిడ్స్ అధికంగా ఉంటాయి.

రాజధానిగా అమరావతినే కొనసాగించాలి

- ఈ ప్రాంత ప్రజలను నట్టేట ముంచిన పాపం బిజెపి, వైసిపిలదే
- రైతుల, ప్రజా ఉద్యమానికి సిపిఐ(ఎం) మద్దతు : వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధానిగా అమరావతినే కొనసాగించాలన్న డిమాండ్‌ను సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ పునరుద్ఘాటించింది. అభివృద్ధిని వికేంద్రీకరించి వెనకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కోరింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు గురువారం నాడు ఇక్కడ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాజధానిగా అమరావతిని కొనసాగిస్తామని ఎన్నికలకు ముందు వైసిపి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, రాజధాని ప్రజలకు, రైతులకు పూలింగ్ చట్టప్రకారం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ గత 1200 రోజులుగా అమరావతి రైతులు, ప్రజలు ఉద్యమం కొనసాగిస్తున్నారు. వారందరికీ సిపిఎం అభినందనలు తెలుపుతోంది. తొలి నుండి సిపిఎం ఈ ఉద్యమానికి అండగా నిలబడింది. భాగస్వాములయ్యింది. మరోసారి సిపిఎం తన సంపూర్ణ మద్దతును ప్రకటిస్తోందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు శాసనసభలో రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేసే విషయంలో పూర్తి మద్దతు తెలిపారు. రాజధానిగా అమరావతిని కొనసాగిస్తామని, మరింత మెరుగైన రీతిలో అభివద్ధి చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కానీ తదనంతరం మాటతప్పి మూడు రాజధానుల పేరుతో వివాదాన్ని లేపారు. వికేంద్రీకరణ సాకుతో రాజధానిని చిన్నా భిన్నం చేస్తున్నారు. రాజధాని లేని రాష్ట్రంగా మార్చిన పాపం వైసిపి, బిజెపిలదే నన్నారు. ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన మోడీ దానిని పూర్తిగా విస్మరించారు. నమ్మక ద్రోహం చేశారు. అమరావతి శంఖుస్థాపనకు ఢిల్లీ నుండి చెంబుడు నీళ్ళు, గుప్పెడు మట్టి తెచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలనోట్లో మట్టి కొట్టారు. బిజెపి, కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతి విషయంలో ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నది. కపటనాటకమాడుతోంది. రాజధానికి మాకు సంబంధం లేదని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. మూడు రాజధానుల విషయంలో బిజెపి గోడమీద పిల్లిలా వ్యవహరిస్తూ ప్రజలను మోసగించింది. గత ఆరేళ్ల నుండి కేంద్ర బడ్జెట్లో రాజధాని అమరావతికి నయా పైసా నిధులు కేటాయించలేదు. అమరావతి అభివద్ధికి 42 వేల కోట్ల రూపాయల అవసరమని ఆనాటి టిడిపి, బిజెపితో కూడిన రాష్ట్ర ప్రభుత్వమే కేంద్రానికి నివేదిక పంపింది. ఈ కాలంలో 1500 కోట్ల రూపాయలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నది. 42 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అమరావతిలో స్థలాలు కేటాయించినా, నిర్మాణాలు ప్రారంభించలేదు. అమరావతి రైలు ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. మెట్రో రైల్ ఊసే ఎత్తటం లేదు. బిజెపి, వైసిపి కుమ్మక్కయి అమరావతిని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్యాకేజీ, పోలవరం తదితర అన్ని అంశాలలో కేంద్రం రాష్ట్రానికి దగా చేసింది. సంవత్సరంపాటు ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమాన్ని పాశవికంగా అణిచివేసింది. బిజెపి మోసపూరితంగా అమరావతి ఉద్యమానికి మద్దతు అంటూనే అమరావతిని నీరుగారుస్తోంది. సోము వీర్రాజు అమరావతి యాత్ర పేరుతో పర్యటించినప్పుడు బిజెపి, వైసిపి తోడు దొంగలేనని అమరావతి సాధారణ రైతులే వ్యాఖ్యానించిన విషయం అందరికీ విదితమే. కానీ బిజెపి రైతు ఉద్యమానికి మద్దతు పేరుతో ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నది. బిజెపి, కేంద్ర ప్రభుత్వాన్ని నమ్ముకుంటే అమరావతి నిలబడుతుందని, అమరావతి రైతులకు న్యాయం జరుగుతుందని నమ్మిన వారి ఆశలు అడియాశలయ్యాయి. ఇప్పటికైనా అమరావతి ఉద్యమకారులు, ప్రజలు బిజెపి కపటనాటకాన్ని గమనించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం ద్వారానే అమరావతికి న్యాయం జరుగుతుందని గమనించాలి. బిజెపితో కలిసి వ్యవహరించటం అమరావతి ఉద్యమానికి కూడా నష్టదాయికమని నాలుగేళ్ళ అనుభవం రుజువు చేసింది. అందుకే సిపిఐ(ఎం) తొలి నుండీ బిజెపి కపట వైఖరిని ఎండగడుతూ వారితో కలిసి వేదిక పంచుకోవడానికి నిరాకరిస్తూ వచ్చిందని శ్రీనివాసరావు విమర్శించారు.

వైసిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పథకం ప్రకారం అమరావతిని నీరుగారుస్తూ వచ్చారు. వేలకోట్ల రూపాయల ప్రజాధనంతో అమరావతిలో జరిగే నిర్మాణాలను నిలిపివేశారు. ప్రజా సొమ్మును వృధా చేశారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని, నిర్దిష్ట కాలపరిమితిలో నిర్మాణాలు పూర్తి చేయాలని, చట్టబద్ధమైన అంశాలు అమలు చేయాలని హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి మొండి వైఖరి విడనాడకుండా సుప్రీం కోర్టుకు అప్పీలు చేశారు. సుప్రీం కోర్టు స్టే ఇవ్వడానికి నిరాకరించినా, లిటిగేషన్లు కొనసాగిస్తూనే ఉన్నారు. మూడు రాజధానులని ఒకమాట, ఆ తరువాత విశాఖే రాజధాని అని మరోమాట మాట్లాడుతూ వైసిపి నేతలు గందరగోళం సృష్టిస్తున్నారు. ముఖ్యమంత్రి త్వరలోనే తన నివాసం విశాఖకు మార్చుకుంటున్నానని బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తూ వివాదాలను రగల్చుతూనే ఉన్నారు. కర్నూలులో హైకోర్టు అని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని ఆ ప్రకటనలో దుయ్యబట్టారు.


వైసిపి ప్రభుత్వం అమరావతి రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మొండి కేస్తున్నది. రైతులకు సకాలంలో కౌలు ఇవ్వడం లేదు. పనులు కోల్పోయిన భూమి లేని కూలీలకు పెన్షన్ 5000 రూపాయలకు పెంచుతామని మాట ఇచ్చి నయా పైసా పెంచలేదు. దళితుల అసైన్డ్ భూములకు సమాన ప్యాకేజీ ఇస్తామని మాట ఇచ్చి తప్పింది. కనీసం వారికి కౌలు కూడా ఇవ్వడం లేదు. అమరావతిలో నిర్మాణం పూర్తి అయిన ఐదువేల టిట్కో ఇళ్లను ఇప్పటికీ రాజధాని పేదలకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నది. రాజదాని నిర్మాణ పనులన్నీ నిలిచిపోయాయని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పేదలకు ఉపాధి కరువైంది. రాజధానిగా అమరావతిని కొనసాగించాలి. అభివృద్ధిని వికేంద్రీ కరించి వెనుకబడిన ప్రాంతాలను సమగ్రంగా అభివద్ధి చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది. ఈ హామీల అమలు కోసం సిపిఎం పోరాడుతుంది. స్వతంత్ర కృషిని కొనసాగిస్తూనే, ఉమ్మడి ఉద్యమంలో భాగస్వాములవుతుందని తెలిపారు.

ఐపిఎల్‌కు వేళాయే..

ప్రారంభోత్సవ వేడుకల్లో అలరించనున్న రష్మిక, తమన్నా
గుజరాత్ × చెన్నై మ్యాచ్‌తో షురూ..

రాత్రి 6.00గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో





అహ్మదాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) 2023 సీజన్-16 శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ గుజరాత్ జెయింట్-చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌తో ఈ ఏడాది ఐపిఎల్ సీజన్ ప్రారంభం కానుంది. కోవిడ్ కారణంగా రెండేళ్లుగా ఐపిఎల్ టోర్నీ విదేశాల్లోనే జరగ్గా.. మళ్లీ ఇన్నాళ్లకు అన్ని మ్యాచ్‌లు భారత్‌లోనే జరగనున్నాయి. తొలి మ్యాచ్ ప్రారంభానికి ముందు ప్రారంభోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకల్లో టాలీవుడ్ తారలు రష్మిక, తమన్నా భాటియా ప్రధాన ఆకర్షణగా నిలువనున్నారు. స్టేడియం వెలుపల లేజర్ షోలతో ఐపిఎల్ ట్రోఫీని మేఘాల్లో ఆవిష్కరించిన ఫొటోలను బిసిసిఐ గురువారం ట్విటర్‌లో పోస్ట్ చేసింది. అలాగే 10జట్ల కెప్టెన్లు కలిసి సీజన్-16 ఐపిఎల్ ట్రోఫీని ఆవిష్కరించిన ఫొటోలనూ పోస్ట్ చేసింది. 12 వేదికల్లో మొత్తం 70 మ్యాచులు జరగనున్నాయి. గౌహతి, ధర్మశాల వేదికల్లో రెండేసి మ్యాచ్‌లు జరగనున్నాయి. గత సీజన్‌లో ఐదుసార్లు టైటిల్ విజేత ముంబయి ఇండియన్స్, 4సార్లు టైటిల్ విజేత చెన్నై సూపర్‌కింగ్స్ చివరి స్థానాల్లో నిలిచి ప్రేక్షకులను నిరాశపరిచాయి.

కొత్త నిబంధనలు..

ఈ సీజన్ నుంచి కొత్త నిబంధనలు ఐపిఎల్‌లో చోటు చేసుకున్నాడు. గాయపడ్డ ప్లేయర్ స్థానంలో మరో ప్లేయర్ బ్యాటింగ్ చేసే అవకాశాన్ని ఐపిఎల్ తొలిసారి ప్రవేశపెట్టింది. అలాగే టాస్ వేసిన తర్వాత మైదానంలో మ్యాచ్ ఆడే 11మంది ఆటగాళ్ల జాబితాను ప్రకటించడం డిఆర్‌ఎస్‌తో పాటు మరి కొన్ని సరికొత్త నిర్ణయాలకు బిసిసిఐ తెరలేపింది.

ముఖేష్ స్థానంలో ఆకాశ్‌కు చోటు

చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు ఐపిఎల్ టోర్నీ ప్రారంభానికి ముందు మరో ఆటగాడిని మార్పు చేసింది. గాయపడ్డ ముఖేశ్ చౌదరి స్థానంలో 2020 అండర్-19 ప్రపంచకప్ జట్టులో సభ్యుడు ఆకాశ్ సింగ్‌కు చోటు కల్పించింది. ఎడమచేతివాటం పేసర్ అయిన ఆకాశ్ సింగ్.. 2020 ఐపిఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ తరపున ఆడాడు. 9 లిస్ట్ -ఏ, ఐదు ఫస్ట్‌క్లాస్ మ్యాచుల్లో కలిపి మొత్తం 31వికెట్లు తీసాడు. చెన్నై జట్టు ఆకాశ్ సింగ్‌ను 20లక్షల కనీస ధరకు కొనుగోలు చేసింది.

తొలి మ్యాచ్‌కు కెప్టెన్‌గా భువనేశ్వర్

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు రాజస్తాన్ రాయల్స్‌తో ఆడే తొలి మ్యాచ్‌కు కెప్టెన్‌గా భువనేశ్వర్ కుమార్ వ్యవహరించనున్నాడు. ఇరుజట్ల మధ్య ఈ మ్యాచ్ ఆదివారం హైదరాబాద్ వేదికగా జరగనుంది. ఇక సన్‌రైజర్స్ సారథి ఎయిడెన్ మార్కరమ్ దక్షిణాఫ్రికాలో వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడుతున్నందున తొలిమ్యాచ్ నాటికి జట్టులో చేరే అవకాశం లేదని సన్‌రైజర్స్ ఫ్రాంఛైజీ గురువారం ట్విటర్‌లో పేర్కొంది. ఇక మయాంక్ అగర్వాల్ ట్విటర్ వేదికగా.. తమ జట్టు కెప్టెన్ ఎయిడెన్ మర్క్రమ్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. అతనొక రన్ మెషిన్. అని పేర్కొన్నాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో ఏప్రిల్ 7న జరిగే మ్యాచ్ నాటికి మార్కరమ్ జట్టులో చేరనున్నట్లు వెల్లడించింది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ షెడ్యూల్..

తేదీ	ఎవరెవరికి..?	సమయం	వేదిక
ఏప్రిల్-2(ఆది)	హైదరాబాద్×రాజస్తాన్	మ. 3.30గం.కు	హైదరాబాద్
7(శుక్ర)	లక్నో × హైదరాబాద్	రా.7.30గం.కు	లక్నో
9(ఆది)	హైదరాబాద్ × పంజాబ్	రా.7.30గం.కు	హైదరాబాద్
14(శుక్ర)	కోల్‌కతా × హైదరాబాద్	రా.7.30గం.కు	కోల్‌కతా
18(మంగళ)	హైదరాబాద్ × ముంబయి	రా.7.30గం.కు	హైదరాబాద్
21(శుక్ర)	చెన్నై × హైదరాబాద్	రా.7.30గం.కు	చెన్నై
24(సోమ)	హైదరాబాద్ × ఢిల్లీ	రా.7.30గం.కు	హైదరాబాద్
29(శని)	ఢిల్లీ × హైదరాబాద్	రా.7.30గం.కు	ఢిల్లీ
మే-4(గురు)	హైదరాబాద్ × కోల్‌కతా	రా.7.30గం.కు	హైదరాబాద్
7(ఆది)	రాజస్తాన్ × హైదరాబాద్	రా.7.30గం.కు	జైపూర్
13(శని)	హైదరాబాద్ × లక్నో	మ.3.30గం.కు	హైదరాబాద్
15(సోమ)	గుజరాత్ × హైదరాబాద్	రా.7.30గం.కు	అహ్మదాబాద్
18(గురు)	హైదరాబాద్ × బెంగళూరు	రా.7.30గం.కు	హైదరాబాద్
21(ఆది)	ముంబయి × హైదరాబాద్	మ.3.30గం.కు	ముంబయి

మోడీకి వ్యతిరేకంగా 11 భాషల్లో పోస్టర్లు : ఆప్

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో కేంద్రానికి, ఆప్ ప్రభుత్వానికి మధ్య 'పోస్టర్ల' యుద్ధం మరింత ముదిరింది. ప్రధాని మోడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 11 భాషల్లో పోస్టర్లను విడుదల చేయనున్నట్లు గురువారం ఆప్ తెలిపింది. 11 భాషల్లో ఈ పోస్టర్‌లను ముద్రించామని, వాటిని ఆయారాష్ట్రాల్లో అంటించనున్నట్లు ఆప్ నేత, ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ తెలిపారు. ఇటీవల ఢిల్లీలోని అన్ని గోడలు, విద్యుత్ స్తంభాలపై 'మోడీ హటావో, దేశ్ బచావో' అన్న పోస్టర్లు వెలిసిన సంగతి తెలిసిందే. ఈ పోస్టర్లపై 49 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ఇద్దరు ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో పాటు ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజల ఆస్తులను ధ్వంసం చేసినందుకు అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొనడం గమనార్హం.

ప్రయాణికుల ఫెర్రీలో అగ్ని ప్రమాదం

31 మంది మృతి, ఫిలిప్పైన్స్ ఘోరం

మనీలా: ఫిలిప్పైన్స్‌లో స్థానికంగా దీవుల మధ్య రాకపోకలు సాగించే ఓ ప్రయాణికుల ఫెర్రీలో అగ్నిప్రమాదం జరిగి 31 మంది మరణించారు. మృతుల్లో ఆరు నెలల పాప కూడా ఉంది. ఫిలిప్పైన్స్ కోస్ట్‌గార్డ్ అధికారులు గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం దక్షిణ ఫిలిప్పైన్స్‌లోని బసిలాన్ ద్వీపం వద్ద బుధవారం రాత్రి సమయంలో 'ఎంవీ లేడీ మేరీ జాయ్ 3' అనే ప్రయాణికుల ఫెర్రీలో ఈ ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో నీళ్లలోకి దూకడంతో 10 మంది మరణించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతుందని అధికారులు చెప్పారు.

క్వార్టర్స్‌కు సింధు, శ్రీకాంత్

స్పెయిన్ మాస్టర్స్ సూపర్-300



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ సింగిల్స్ విభాగంలో భారత షట్లర్లు పివి సింధు, కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో మాజీ నంబర్‌వన్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ 21-15, 21-12తో భారత్‌కే చెందిన బి. సాయి ప్రణీత్‌పై వరుససెట్లలో గెలిచాడు. క్వార్టర్స్‌లో 5వ సీడ్ కిదాంబి శ్రీకాంత్ టాప్‌సీడ్ జపాన్‌కు చెందిన నిషిమోటోతో తలపడనున్నాడు. ఇతర పోటీల్లో కిరణ్ జార్జి 16-21, 14-21తో డెన్మార్క్‌కు చెందిన జొన్నాసెన్ చేతిలో, ప్రియాంశు 21-18, 16-21, 11-21తో 8వ సీడ్ పొపోవ్(ఫ్రాన్స్) చేతిలో ఓడారు. మరో ఉత్కంఠ పోటీలో సమీర్ వర్మ 9-21, 21-14, 17-21తో జపాన్‌కు చెందిన 2వ సీడ్ సునేయమా చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. ఇక మహిళల సింగిల్స్‌లో పివి సింధు 21-10, 21-14తో ఇండోనేషియాకు చెందిన వర్దానీపై వరుససెట్లలో విజయం సాధించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68